1st Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN


సంపుటి : 3 సంచిక : 35 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ గురువారం 05 ఫిబ్రవరి 2026 పేజీలు 8 : వెల 3/–ఒంగోలు

VOLUME : 03 ISSUE : 35 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Thursday 05 February 2026 PAGES : 8 PRICE : 3/-

# పొగాకు ముడి ఉత్పత్తులపై పన్ను సున్నా..

## కేంద్రం నిర్ణయాన్ని స్వాగతించిన ఏపీ!

- అన్ బ్రాండెడ్ ముడి పొగాకుపై సున్నా శాతం సుంకం
- బ్రాండెడ్ ఉత్పత్తులకు 18 శాతం ఎక్సైజ్ డ్యూటీ
- ఫిబ్రవరి 1వ తేదీ నుంచే అమల్లోకి కొత్త రూల్స్
- రైతులకు మేలు జరుగుతుందన్న సీఎం చంద్రబాబు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 04)

ఆంధ్రప్రదేశ్‌లోని పొగాకు రైతులు, చిరు వ్యాపారుల దశాబ్దాల కల నెరవేరింది. ఎలాంటి బ్రాండ్ లేని ముడి పొగాకు ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకాన్ని సున్నాకు తగ్గిస్తూ కేంద్ర ఆర్థిక శాఖ జారీ చేసిన గెజిట్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మనస్ఫూర్తిగా స్వాగతించారు. ఈ నిర్ణయం వల్ల పొగాకు వాణిజ్యంలో పారదర్శకత పెరగడమే కాకుండా, సామాన్య రైతులకు –మిగతా 2లో

## అమెరికాతో వాణిజ్య ఒప్పందం పెద్ద నిర్ణయం



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 04)

అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలనుకోవడం పెద్ద నిర్ణయమని, దేశంలో ప్రతి ఒక్కరికీ దానివల్ల ప్రయోజనం ఉంటుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇలాంటి ఒప్పందాలైనా, బడ్జెట్ అయినా– అన్నింటా దేశానికి అనుకూలంగానే తమ సర్కారు ఎల్లప్పుడూ పనిచేస్తుందని చెప్పారు. మంగళవారం పార్లమెంటు సముదాయంలో జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో కూటమి ఎంపీలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఐరోపా సమాఖ్య (ఈయూ), అమెరికాలతో ఒప్పందాల విషయంలో కూటమి ఎంపీలు ముందుగా ప్రధానిని అభినందించారు. అగ్రరాజ్యంతో ఒప్పందం వల్ల భారత్‌లోని తయారీదారులు, ఎగుమతిదారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు బలపడతారని మోదీ చెప్పారు. 'ట్రంప్ విధించిన సుంకాలపై మమ్మల్ని విమర్శించారు. అయినా సహనంతో ఉన్నాం. అదే ఇప్పుడు గెలిపించింది' అని అన్నారు. "ఇటీవల జరిగిన పలు ఎన్నికల్లో సాధించిన విజయాలతో సంతృప్తిపడిపోవద్దు. క్షేత్రస్థాయిలో లేకుండా ఎన్నికల్లో గెలవలేం. ప్రజల సంక్షేమం కోసం మంచిపనులు చేస్తుండాలి. పార్లమెంటులో మీరంతా చురుకైన భూమిక పోషించాలి. స్థాయీ సంఘాల ద్వారా ఉత్తమ పనితీరు కనపరచాలి" అని దిశానిర్దేశం చేశారు.

ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ భేటీ అనంతరం అభివాదం చేస్తూ బయటకు వస్తున్న మోదీ

**ఇన్ని ఒప్పందాలు ఓ చరిత్ర: రిజిజు**

సమావేశానంతరం కేంద్రమంత్రి కిరణ్ రిజిజు విలేకరులతో మాట్లాడారు. అమెరికాతో ఒప్పందంపై యావద్దేశంలో ఉత్సుకత ఉందని చెప్పారు. "మోదీ నేతృత్వంలో –మిగతా 2లో

## వ్యవసాయ, పాడి రంగానికి పూర్తి రక్షణ: గోయల్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 04)

సున్నితమైన వ్యవసాయ, పాడి రంగాలకు భారత్, అమెరికా ఒప్పందంలో పూర్తి రక్షణ లభించనుందని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. అంతేకాకుండా జౌళి–వస్త్రాలు, ప్లాస్టిక్, గృహాలంకరణ సామగ్రి, తోలు ఉత్పత్తులు, రత్నాభరణాలు, సేంద్రియ రసాయనాలు, రబ్బరు ఉత్పత్తులు, యంత్రాలు, విమాన తయారీ రంగంలోని –మిగతా 2లో


## 2.5 కోట్ల ఆధార్ కార్డులను డీయాక్టివేట్ చేసిన కేంద్రం

- గుర్తింపు మోసాలను అరికట్టేందుకు కేంద్రం చర్యలు
- దేశవ్యాప్తంగా మరణించిన 2.5 కోట్ల మంది ఆధార్ నంబర్ల రద్దు
- పార్లమెంటులో వెల్లడించిన కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద
- ఆధార్ భద్రతకు బయోమెట్రిక్ లాక్, ఫేస్ అథెంటికేషన్ ఫీచర్లు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 04)

గుర్తింపు మోసాలను అరికట్టే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. దేశవ్యాప్తంగా మరణించిన 2.5 కోట్లకు పైగా వ్యక్తుల ఆధార్ నంబర్లను డీయాక్టివేట్ చేసినట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద బుధవారం పార్లమెంటుకు తెలిపారు. –మిగతా 2లో

## ఉచిత వైద్య సేవల్లో దేశానికి నమూనాగా ఏపీ: మంత్రి సత్యకుమార్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 04)

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న ఉచిత వైద్య సేవల విధానం దేశానికే నమూనాగా నిలుస్తోందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. జాతీయ అంధత్వనివారణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని గుంటూరు జిల్లా తెనాలిలో ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమం కింద రాష్ట్రవ్యాప్తంగా 94,689 మంది విద్యార్థులకు రూ. 2.52 కోట్ల ఖర్చుతో కంటి అద్దాలను అందిస్తున్నామని వివరించారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లా డుతూ రాష్ట్రవ్యాప్త కార్యక్రమాన్ని తెనాలిలో ప్రారంభించినందుకు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా క్యాన్సర్ బాధితుల ఉచిత వైద్యానికి ప్రభుత్వం ఏటా రూ. 650 కోట్లకుపైగా ఖర్చుచేస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ నెల 4న క్యాన్సర్ డే సందర్భంగా మహమ్మారి కట్టడికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఒక ప్రకటనలో వివరించారు. క్యాన్సర్ కేసులను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు నిర్వహిస్తున్న ఎన్సీడీ 4.0 సర్వేలో 3.71 లక్షల మందికి నోటి క్యాన్సర్, 1.80 లక్షల మందికి రొమ్ము, 2.46 లక్షల మందికి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు వివిధ దశల్లో ఉన్నట్లు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలకు కోడిగుడ్ల సరఫరా కాంట్రాక్టులు కోళ్ల రైతులకే



- ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సిటీ
- లంబసింగిలో కుంకుమపువ్వు సాగుకు అనుమతులు
- మామిడి ప్రాసెసింగ్ యూనిట్ల సమస్యలు పరిష్కరిస్తాం
- వ్యవసాయ అనుబంధ రంగాల సమీక్షలో సీఎం చంద్రబాబు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 04)

ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలకు కోడిగుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టులను కోళ్ల రైతులకే ఇవ్వాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కోళ్ల రంగాన్ని బలోపేతం చేసే చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సిటీ ఏర్పాటు చేయాలని, అందులో సాగు, ప్రాసెసింగ్, మార్కెటింగ్ సహా అన్నిటికి చోటు కల్పించాలని సూచించారు. లంబసింగిలో గిరిజనుల భాగస్వామ్యంతో కుంకుమ పువ్వు సాగుకు ముందుకొచ్చే సంస్థలకు అనుమతి ఇవ్వాలని ఆదేశించారు.

త్వరలోనే మామిడి ప్రాసెసింగ్ పరిశ్రమల యజమానులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. మంగళవారం సాయంత్రం ఆయన సచివాలయంలో వ్యవసాయ అనుబంధశాఖలపై సమీక్షించారు. 'ఆంధ్రప్రదేశ్‌ను అతిపెద్ద ప్రకృతి వ్యవసాయ క్షేత్రంగా మార్చే కార్యక్రమానికి త్వరలో శ్రీకారం చుట్టాలి. ప్రస్తుతం రాష్ట్రంలో 18 లక్షల మంది రైతులు 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకు వచ్చారు. దీన్ని 2030–31 నాటికి 40 లక్షల మంది రైతులు, –మిగతా 2లో

## వైసీపీ హిందూ ద్రోహి: నాగబాబు తీవ్ర వ్యాఖ్యలు

- వైసీపీని విమర్శిస్తూ వీడియో విడుదల చేసిన నాగబాబు
- వేంకటేశ్వర స్వామిని సామాన్య భక్తులకు దూరం చేశారని మండిపాటు
- అంతర్వేది, రామతీర్థం తదితన ఘటనలను ప్రస్తావించిన వైనం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 04)

వైసీపీ పార్టీ హిందూ ద్రోహి అంటూ జనసేన ఎమ్మెల్సీ నాగబాబు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రామతీర్థం ధ్వంసం ఘటన, అంతర్వేది రథం దగ్ధం ఘటన, తిరుమల డిక్లరేషన్ తదితర అంశాలపై ఆయన స్పందిస్తూ వైసీపీపై మండిపడ్డారు. తిరుమలలో వసతి గృహాల ధరలు పెంచి... వేంకటేశ్వర స్వామిని సామాన్య భక్తులకు దూరం చేశారని విమర్శించారు. ఏ మాఫియాను కాపాడటానికి ఇదంతా చేశావు జగన్? అని ప్రశ్నించారు. హిందువులపై కుతంత్రాలు చేయడం తప్ప వైసీపీ నేతలకు మరొకటి లేదని అన్నారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో విడుదల చేశారు. అంతర్వేది ఘటనపై సీబీఐ విచారణ పేరుతో వైసీపీ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని నాగబాబు మండిపడ్డారు. సనాతన ధర్మాన్ని ఆచరించే హిందువుగా తాను గర్వపడుతున్నానని చెప్పారు. వైసీపీ నేతలకు ఇతరుల –మిగతా 2లో

## సుప్రీంలో 'సర్' విచారణ.. స్వయంగా వాదనలు వినిపించిన మమతా బెనర్జీ



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 04)

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై విచారణలో భాగంగా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ (మీఘఎఫ్ఘ దీఘఅవతీయవవ) సుప్రీంకోర్టులో స్వయంగా వాదనలు వినిపించారు. 'సర్' ప్రక్రియకు సంబంధించి తాను ఈసీకి ఆరుసార్లు లేఖలు రాసినట్లు ఆమె అత్యున్నత న్యాయస్థానానికి వెల్లడించారు. అయినప్పటికీ తనకు న్యాయం జరగలేదని తెలిపారు. తన రాజకీయ పార్టీ కోసం పోరాటం చేయడం లేదని, ఓ పెద్ద కారణంతోనే న్యాయం కోసం ఇక్కడికి వచ్చినట్లు పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లో సర్‌ను వ్యతిరేకిస్తూ తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) చేస్తున్న పోరాటం కొన్నిరోజుల క్రితమే దిల్లీకి చేరింది. సర్ సమస్యలపై మాట్లాడేందుకు ఇప్పటికే ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)తోనూ భేటీ అయ్యారు. అయితే ఆ భేటీ నుంచి ఆమె మధ్యలోనే వాకౌట్ చేశారు. మరోవైపు, సర్ ప్రక్రియ ఏకపక్షంగా నిర్వహిస్తున్నారని, –మిగతా 2లో

# ఫుడ్ కోర్టు ప్రారంభం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 4)

ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్, మెప్మా ఆధ్వర్యంలో వన్ ఫ్యామిలీ, వన్ ఎంటర్ ప్రివర్ కార్యక్రమంలో భాగంగా నూతనంగా లైవ్‌లీ హుడ్ యూనిట్ "ధాత్రి ఫుడ్ కోర్ట్" ఏర్పాటు చేయడం జరిగింది. ఈ యూనిట్‌ను సాయి ఎస్‌హెచ్‌జీ సంఘానికి చెందిన సింగిరెడ్డి షణ్ముఖ బ్యాంకు లింకేజి రుణం పొందిన అనంతరం ఫుడ్ కోర్ట్ వ్యాపారాన్ని ప్రారంభించారు. ఈ ఫుడ్ కోర్ట్ యూనిట్‌ను మెప్మా పీడీ ఆనంద్ సత్యపాల్ ప్రారంభించారు. ఈ ఫుడ్ కోర్ట్‌లో టిఫిన్స్, వెజ్ రోల్స్, షవార్మా, మోమోస్, చపాతీ, పరోటా, తదితర ఆహార పదార్థాలు అందుబాటులో ఉంటాయి. ఈ కార్యక్రమంలో సీఎంఎం డి సంతోష్ కుమార్, సీవోలు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం కమిటీ సభ్యులుగా పిన్నిక విజయలక్ష్మి, శివ కుమార్ నియామకం పై అభినందనల వెల్లువ



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఫిబ్రవరి 4)

మార్కాపురం జిల్లా మార్కాపురం శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం నూతన కమిటీ సభ్యులుగా పిన్నిక విజయలక్ష్మి శివ కుమార్ నియామకం జరిగింది. ఈ సందర్భంగా పిన్నిక శివ మాట్లాడుతూ..ఈ పదవి నియామకానికి సహకరించిన మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మరియు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పిన్నిక శివ మార్కాపురం పట్టణ దీజ సంఘం అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. తెలుగు దేశం పార్టీ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించి పార్టీ అధికారంలోకి రావడానికి కృషి చేసిన పిన్నిక శివకు ఈ పదవి వరించడం పట్ల పిన్నిక శివ, మిత్ర మండలి సభ్యులు హనీష్, మహేష్, లక్ష్మిరెడ్డి, కాశిరెడ్డి, మండ్ల శ్రీను, ఎం సుబ్బారెడ్డి, దొండపాటి, దూదేకుల నాగూర్, తదితరులు అభినందనలు తెలియజేశారు.

# ఏకీకృత కుటుంబ సర్వే పై త్వరితగతిన పూర్తి చేయాలి




(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 4)

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఏకీకృత కుటుంబ సర్వే పై ఏ విధమైన నిర్లక్ష్యం ఊహించకుండా త్వరిత తగతిన పూర్తి చేయాలి భూపతి పల్లి గ్రామ సచివాలయాన్ని సందర్శించి న మార్కాపురం ఎంపీడీవో బాల చెన్నయ్య పేర్కొన్నారు. మార్కాపురం మండల పరిధిలో గల 21 సచివాలయాలలో దాదాపు 17400 హౌస్ హోల్డ్స్ ఉన్నాయి. ఇప్పటివరకు కేవలం 27% మాత్రమే సర్వే పూర్తి చేయబడింది. కనుక జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టి మూడు రోజులలో 100% పూర్తి చేయాలని ఆదేశించారు. కనుక అందరు సచివాలయ సిబ్బంది ఈ సర్వేలో పాల్గొని పూర్తి చేయవలసిందిగా ఆదేశించడం అయ్యింది. ఏ ఒక్క సచివాలయ ఉద్యోగికి మినహాయింపు లేదని తెలియజేశారు.

## మొదటి పేజీ తరువాయి

# పొగాకు ముడి ఉత్పత్తులపై పన్ను సున్నా..

మెరుగైన ధర లభిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గతంలో బ్రాండ్ లేని ముడి పొగాకు విక్రయాలపై సరైన నిబంధనలు లేకపోవడంతో అధికారులు, రైతుల మధ్య తరచూ వివాదాలు తలెత్తేవి. పన్ను ఎగవేత ఆరోపణలతో రైతులు ఇబ్బందులు పడేవారు. తాజా గెజిట్ (హెచ్ కోడ్ 2401) ద్వారా కేంద్రం క్లారిటీ ఇచ్చింది.

రైతులు సంచుల్లో విక్రయించే ముడి పొగాకు, ప్యాకింగ్ లేని రీటైల్ విక్రయాలపై ఎలాంటి పన్ను ఉండదు. కంపెనీ బ్రాండ్ పేరుతో ప్యాక్ చేసిన పొగాకు, చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో అమ్మే ఉత్పత్తులపై మాత్రం 18 శాతం ఎక్సైజ్ సుంకం కొనసాగుతుంది.

ముడి పొగాకు పేరుతో బ్రాండెడ్ ఉత్పత్తులను అక్రమంగా విక్రయించి పన్ను ఎగ్గొట్టే వారికి ఈ కొత్త మార్గదర్శకాలు అడ్డుకట్ట వేయనున్నాయి. ఈ నోటిఫికేషన్‌ను దేశవ్యాప్తంగా కఠినంగా అమలు చేయాలని కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డును ఏపీ ప్రభుత్వం కోరింది.

ఈ ఏడాది ఫిబ్రవరి 1వ తేదీ నుంచే ఈ మార్పులు అమల్లోకి వచ్చాయి. ముడి పొగాకు సరఫరా వ్యవస్థలో అడ్డంకులు తొలగిపోవడంతో ఎగుమతులు కూడా పెరిగే అవకాశం ఉందని రాష్ట్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. దీనివల్ల ముఖ్యంగా ప్రకాశం, గుంటూరు, గోదావరి జిల్లాల్లోని లక్షలాది మంది పొగాకు రైతులకు నేరుగా ప్రయోజనం చేకూరనుంది. ఈ నిర్ణయం వల్ల మార్కెట్ యార్డుల్లో పొగాకు కొనుగోళు మరింత వేగవంతం అయ్యే అవకాశం ఉంది. వ్యాపారులు పన్ను భయం లేకుండా నేరుగా రైతుల నుంచి సరుకు కొనుగోలు చేయవచ్చు.

# అమెరికాతో వాణిజ్య ఒప్పందం పెద్ద నిర్ణయం

తొమ్మిది ఒప్పందాలు కొలిక్కి వచ్చాయి. మొత్తం 39 దేశాలతో సంతకాలు జరిగాయి. ఇదొక చరిత్ర" అని వివరించారు. భాజపా, తెదేపా, జేడీ(యు), ఎల్జేపీ (ఆర్), శివసేన, జేడీ(ఎస్) తదితర భాగస్వామ్య పక్షాలు ఈ సమావేశంలో పాల్గొన్నాయి.

# వైసీపీ హిందూ ద్రోహి నాగబాబు తీవ్ర వ్యాఖ్యలు

వ్యక్తిగత జీవితాలపై ఉన్న ఆసక్తి... హిందూ దేవాలయాలపై లేదని విమర్శించారు. సినిమా రివ్యూలపై ఉన్న శ్రద్ధ... భగవంతుడిపై ఎందుకు లేదని ప్రశ్నించారు.

తిరుమల డిక్లరేషన్ ఇవ్వాలని అడిగితే అవమానకరంగా మాట్లాడారని నాగబాబు విమర్శించారు. పవన్ కల్యాణ్ భార్య, కూతురు తిరుమలలో డిక్లరేషన్ ఇచ్చారని, దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం కూడా డిక్లరేషన్ ఇచ్చారని... అబ్దుల్ కలాం కంటే కూడా నీవు గొప్ప వ్యక్తివా? అని జగన్ పై మండిపడ్డారు. తిరుమల కొండతో పాటు ఇతర కొండలకు గుండు కొట్టాలని చూసింది నీవు కాదా? అని ప్రశ్నించారు.

# ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలకు కోడిగుడ్ల సరఫరా కాంట్రాక్టులు కోళ్ల రైతులకే

50 లక్షల ఎకరాలకు విస్తరించాలి' అని చెప్పారు. 'ప్రకృతి ఉత్పత్తుల సాగు నాణ్యత తెలిసేలా సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ సౌకర్యాలను జూన్ నాటికి కల్పించాలి. ప్రకృతి వ్యవసాయంపై సుభాష్ పాలేకర్‌తో రాష్ట్రమంతా శిక్షణ తరగతులు నిర్వహించాలి' అని సూచించారు.

### విజయవాడలో పీపీపీ విధానంలో పూల మార్కెట్..

విజయవాడలో పీపీపీ విధానంలో పూల మార్కెట్ నిర్మాణానికి చంద్రబాబు ఆమోదం తెలిపారు. డిజి రైతుబజార్ యాప్‌ను ఆయన ఆవిష్కరించారు. వ్యవసాయ యంత్ర పరికరాలకు సంబంధించి ఏపీ ఏఐఎంఎస్ యాప్, కిసాన్ డ్రోన్ యాప్‌లను ప్రారంభించారు. ఇందులో 9,512 యంత్రాలు ఉన్నాయని, రైతులు తమకు అవసరమైనవి వీటిద్వారా బుక్‌చేసి తీసుకోవచ్చన్నారు.

### అమెరికా, ఈయూతో వాణిజ్య ఒప్పందాలతో రైతులకు అవకాశాలు

అమెరికా, యూరోపియన్ దేశాలతో వాణిజ్య ఒప్పందాల వల్ల రాష్ట్రం నుంచి రొయ్యలు, ఎండుమిర్చి, మామిడి, వరి, ప్రాసెస్డ్ ఫుడ్ ఎగుమతులు పెంచుకునేందుకు అవకాశం కలిగిందని, అయితే నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని చంద్రబాబు చెప్పారు. ఎంవోయూ కుదుర్చుకున్న ఆహారశుద్ధి సంస్థలు త్వరితగతిన యూనిట్లు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలన్నారు. 'మామిడి, కోకో, జీడి, కొబ్బరి తోటల్లో అంతర పంటల సాగుకు అవకాశాలున్నాయి. రైతుల్ని ఆ దిశగా ప్రోత్సహించాలి. అరటి ఎగుమతుల్లో వెనకబడ్డాం. దానిపై దృష్టి పెట్టాలి' అని ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించి కేంద్ర విధానాలకు అనుగుణంగా రాష్ట్ర పాలసీలు ఉండాలని సూచించారు.

### పంటల వారీ పండగలు

'కుప్పంలో పూల పండగ నిర్వహించిన విధంగానే.. రాష్ట్రంలో సాగయ్యే పంటలకు సంబంధించి వివిధ ప్రాంతాల్లో పండగలు నిర్వహించాలి. పర్యాటక రంగ అభివృద్ధికి ఇది దోహదపడుతుంది. లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గించడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ పెరుగుతుంది. అవసరమైతే కేంద్రంతో మాట్లాడి వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ప్రత్యేక రైలు బోగీలు ఏర్పాటు చేసేలా చూడాలి. కవర్లతో మామిడికి నాణ్యత, మంచి ధర వచ్చింది. జామ, దానిమ్మ తదితర పండ్ల తోటలకూ దీన్ని అమలు చేయాలి' అని పేర్కొన్నారు. సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

# సుప్రీంలో 'సర్' విచారణ.. స్వయంగా వాదనలు వినిపించిన మమతా బెనర్జీ

అవకతవకలు జరుగుతున్నాయని తృణమూల్ ఎంపీలు ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో తాజాగా జరిగిన విచారణకు మమత హాజరయ్యారు. స్వయంగా వాదనలు వినిపించేందుకు 5 నిమిషాలు సమయం ఇవ్వాలంటూ ఆమె సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను అభ్యర్థించారు. 15 నిమిషాలు తీసుకోండంటూ గడువు ఇచ్చారు.

"ఎన్నికల సంఘం (జుజ) మా అభ్యర్థనలను పట్టించుకోవడం లేదు. సమస్య ఏంటంటే.. చివరకు ఎక్కడా న్యాయం దొరకడం లేదు. ఈసీకి ఆరుసార్లు లేఖ రాసినా.. సమాధానం రాలేదు" అని ఈసీపై విమర్శలు చేశారు. ఆమె వాదనలో వాస్తవం ఉందని పేర్కొన్న కోర్టు.. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని హామీ ఇచ్చింది. అలాగే మమత వేసిన పిటిషన్‌లో భాగంగా ఈసీకి కోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

# వ్యవసాయ, పాడి రంగానికి పూర్తి రక్షణ: గోయల్

కార్మికులకు అపార అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. త్వరలో రెండు దేశాలు సంయుక్త ప్రకటన చేయనున్నాయని, అందులో మరిన్ని వివరాలు వెల్లడవుతాయని వివరించారు. భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంపై ట్రంప్ ప్రకటన చేసిన నేపథ్యంలో మంగళవారం దిల్లీలో మీడియాతో గోయల్ మాట్లాడారు. 'పలు రంగాలపై అమెరికా సుంకం 50శాతం నుంచి 18 శాతానికి తగ్గనుంది. పోటీదారుల కంటే మెరుగైన ఒప్పందం కుదరనుంది. చైనా, బంగ్లాదేశ్, మలేసియా, కంబోడియా, వియత్నాంల కంటే తక్కువ సుంకాలే మనకు అమలు కానున్నాయి' అని గోయల్ వివరించారు.

# 2.5 కోట్ల ఆధార్ కార్డులను డీయాక్టివేట్ చేసిన కేంద్రం

ఆధార్ డేటాబేస్ కచ్చితత్వాన్ని, సమగ్రతను కాపాడేందుకు దేశవ్యాప్తంగా చేపట్టిన శుద్ధీకరణ కార్యక్రమంలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన వివరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద బయోమెట్రిక్ గుర్తింపు వ్యవస్థ అయిన ఆధార్ సుమారు 134 కోట్ల మంది వినియోగదారులను కలిగి ఉంది. మరణించిన వారి ఆధార్ నంబర్లను దుర్వినియోగం చేసి సంక్షేమ పథకాలను పొందడం, ఇతర మోసాలకు పాల్పడటం వంటివి నిరోధించడానికి ఈ డీయాక్టివేషన్ ప్రక్రియ చాలా అవసరమని మంత్రి పేర్కొన్నారు. ఆధార్ దుర్వినియోగాన్ని తగ్గించడానికి భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ అనేక భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు జితిన్ ప్రసాద తెలిపారు. ఇందులో భాగంగా వినియోగదారులు తమ బయోమెట్రిక్స్‌ను లాక్/అన్‌లాక్ చేసుకునే సదుపాయం, లావాదేవీల సమయంలో లబ్ధిదారు భౌతికంగా ఉన్నట్లు నిర్ధారించే 'లైవ్‌నెస్ డిటెక్షన్' ఫీచర్‌తో కూడిన ఫేస్ అథెంటికేషన్, ఆధార్ సెక్యూర్ క్యూఆర్ కోడ్, ఆఫ్‌లైన్ ఈ-కేవైసీ వంటివి అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. వినియోగదారుల ప్రధాన బయోమెట్రిక్ సమాచారాన్ని యూఐడీఏఐ ఎవరితోనూ పంచుకోదని, డేటాను ఎన్‌క్రిప్టెడ్ ఫార్మాట్‌లో భద్రపరచడం తప్పనిసరి చేసిందని ఆయన స్పష్టం చేశారు.

# స్థానిక సంస్థలో బిసి లకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు సమగ్ర కుల గణన చేపట్టాలి

## సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు వి వీరశేఖర్ డిమాండ్

(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఫిబ్రవరి 4)




బద్వేల్ స్థానిక జేవి భవన్‌లోని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఏరియా సమితి ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు వి వీరశేఖర్ మాట్లాడుతూ మన రాష్ట్రంలో దాదాపు 143 వెనకబడిన కులాలు ఉన్నాయి. గత స్థానిక అస్తవస్థలలో బీసీలకు కేటాయించిన స్థానాలు తగ్గించడం వలన వేల సంఖ్యలో స్థానిక సంస్థకు చెందిన పదవులు బీసీలు కోల్పోయారు. తెలంగాణలో ప్రభుత్వ జనాభా లెక్కల సందర్భంగా కులగరణ చేపట్టి అందుకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు స్థానిక సంస్థలో సీట్లు కేటాయిస్తూ అసెంబ్లీలో రెండు బిల్లులు ఆమోదించింది. అదేవిధంగా మన ఆంధ్రప్రదేశ్లో కూడా జనగణలో కులగనన చేపట్టి కులాల ప్రాతిపదికన బీసీలకు స్థానిక సంస్థలో సీటు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. పౌరులందరికీ సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయం హోదాల్లోనూ అవకాశాల్లోనూ సమానత్వం ఇవి భారత రాజ్యాంగంలో మొదటి పేజీలో మనకు మనం రాసుకున్న మూల సూత్రాలు ఈ మహోన్నత లక్ష్యాలతో ఒక న్యాయపూర్వక సమాజాన్ని నిర్మించాలని సంకల్పించి 76 సంవత్సరాలు కావస్తున్న ఈ లక్ష్యసాధనకు అవసరమైన సమగ్ర కుల గణన ఇప్పటికీ జరగలేదంటే ఎవరు ఎంత వెనుకబడి ఉన్నారు. ఎవరికి ఎంత అన్యాయం జరుగుతుంది మన రాజ్యాంగ లక్ష్యాలు ఎంత దూరంలో ఉన్నాయి ప్రశ్నలకు సమాధానాలు మనకు డేటా లేకపోవడం వలన తెలియడం లేదు కులాల వారీగా సామాజిక ఆర్థిక స్థితిగతులు సంపద పంపిణీ, అవకాశాల అసమానతలు స్పష్టంగా తెలియకుండా పోయాయి. ఫలితంగా వెనుకబడిన వర్గాల బీసీ జాబితాలో ఉన్న కులాలు రాజకీయ శక్తి విద్య ఉద్యోగాలు, ఆర్థిక వనరుల్లో తమకు రావలసిన హక్కులను కోల్పోతున్నాయి. కులగణన జరగక పోవడం వల్ల ఏర్పడుతున్న నష్టాలు అపారమైనవన్నారు. కులగణనను కేవలం జనాభా లెక్కలకు పరిమితం చేయకుండా కులాల వారీగా ఆర్థిక రాజకీయ, సామాజిక స్థితిగతులు సంపద పంపిణీ, అవకాశాల సమానత్వాన్ని తెలుసుకునే విధంగా సమగ్రంగా జరిపించాలని ఆయన కోరారు. ఈ అంశాల పైన కోసం అవగాహన కల్పించడం కోసం ఈ నెల 8వ తేదీన కడప నగరంలోని బీసీ భవన్‌లో సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ యొక్క సదస్సుకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హరినాథ్‌రెడ్డి హాజరవుతున్నారు. బద్వేల్ నియోజకవర్గంలో ఉన్నటువంటి బీసీ నాయకులు అందరూ ఈ సదస్సులో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్, పట్టణ కార్యదర్శి బాలు, ఏరియా సహాయ కార్యదర్శులు పివి రమణ, ఇమ్మానియేల్, జిల్లా సమితి సభ్యులు పడిగా వెంకటరమణ, పొంగూరు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.





ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు | తెలుగు దినపత్రిక

05.02.26 గురువారం


## అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 4)

ప్రభుత్వ ఆలోచనలకు తగినట్టుగా అభివృద్ధి కొరకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఎన్‌హెచ్‌ఏ, ఆర్ అండ్‌బి రహదారుల నిర్మాణం, అభివృద్ధి పనులపై సంబంధిత శాఖల అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. బాపట్ల జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులన్ని ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అభివృద్ధిలో బాపట్ల జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. మీ ముందున్న లక్ష్యాలను చేరుకునేలా అధికారులు మీ పనితీరును మెరుగుపరుచుకోవాలని సూచించారు. అవిశ్రాంతంగా పనిచేస్తేనే ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలలో పురోగతిని సాధించగలమన్నారు. మీ ముందున్న లక్ష్యాలను వేగంగా చేరుకోగలిగితే బాపట్ల అన్ని రంగాలలో అభివృద్ధిలోకి వస్తుందన్నారు. "స్వర్ణ బాపట్ల పేరుతో వెబ్ సైట్ ను రూపకల్పన చేస్తున్నామని తెలిపారు." వివరాలను తర్వాత ప్రకటిస్తామన్నారు. రహదారుల నిర్మాణం, మరమ్మతులు పూర్తయితే ప్రజా రవాణా మెరుగుపడుతుందని కలెక్టర్ చెప్పారు. వ్యవసాయ, ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులు, దిగుమతులకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుందన్నారు. తద్వారా ఆర్థిక వనరులు అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని ఆర్‌అండ్‌బి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. నూతన రహదారుల నిర్మాణం, మరమ్మతు పనులు వేగంగా చేపట్టాలన్నారు. ముఖ్యంగా తీర ప్రాంతాలను అనుసంధానిస్తూ (తరువాయి 4లో...)

## నిధులను సద్వినియోగపరచడమే శాసనసభ ఎస్టిమేట్స్ కమిటీ ప్రధాన లక్ష్యం

### కమిటీ చైర్మన్ వి జోగేశ్వరరావు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఫిబ్రవరి 4)

రాష్ట్ర ప్రభుత్వం పేదల అభ్యున్నతికి, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కేటాయిస్తున్న నిధులను సద్వినియోగం పరచడమే ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎస్టిమేట్స్ కమిటీ ప్రధాన లక్ష్యమని ఆ కమిటీ చైర్మన్ వి జోగేశ్వరరావు చెప్పారు. బుధవారం ఉదయం ఒంగోలు కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎస్టిమేట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కమిటీ చైర్మన్ వి జోగేశ్వరరావుతో పాటు సభ్యులు మద్దిపాటి వెంకటరాజు, వివి సూర్యనారాయణరాజు, అసిస్టెంట్ సెక్రటరీ భిక్షం, ఒంగోలు, మార్కాపురం జిల్లాల జాయింట్ కలెక్టర్లు కల్పనా కుమారి, పులి శ్రీనివాసులు, కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశీ తదితరులు హాజరయ్యారు. సమావేశంలో తొలుత జిల్లాలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి 2019-20, 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాల్లో ప్రభుత్వం విడుదల చేసిన బడ్జెట్ కేటాయింపులు, ఖర్చుల వివరాలను ఆయా శాఖల అధికారులు కమిటీ సభ్యులకు వివరించారు. ఐసిడిఎస్, డీఆర్డిఎ, వ్యవసాయ మరియు అనుబంధ శాఖలైన పశు సంవర్ధక, ఉద్యాన శాఖలు, సోషల్ వెల్ఫేర్, పబ్లిక్ హెల్త్, విద్య శాఖ, భూగర్భ మరియు గనులు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగాల అధికారులు తమ శాఖలకు సంబంధించిన బడ్జెట్ కేటాయింపు, వినియోగం పై సమగ్రంగా వివరించగా, కమిటీ సభ్యులు బడ్జెట్ వినియోగంపై క్షుణ్ణంగా చర్చించారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా మరియు మార్కాపురం జిల్లాల భౌగోళిక స్వరూపం, పారిశ్రామిక హబ్ గా మారుటకు గల అవకాశాలు, పరిస్థితులు, అందుబాటులో ఉన్న వనరులు, పారిశ్రామిక అభివృద్ధి పై రూపొందించిన ప్రణాళికను జిల్లా కలెక్టర్ రాజాబాబు, కమిటీ సభ్యులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించగా, కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ పి రాజాబాబు మాట్లాడుతూ జిల్లాలో శాఖల వారీగా ఎంత బడ్జెట్ విడుదలైంది. ఎంత మేర ఖర్చు జరిగింది అనే అంశాలపై సమగ్రంగా కమిటీ అధ్యయనం చేస్తుందన్నారు. జిల్లాలో ఏ పథకానికి ఎక్కువ డిమాండ్ ఉందో గుర్తించి, ఆ పథకానికి అధికంగా నిధులు విడుదల అయ్యేలా ఎస్టిమేట్స్ కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుందని తెలిపారు. అనంతరం కమిటీ చైర్మన్ వి జోగేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులపై సమగ్ర వివరాలతో పాటు ఈ సందర్భంగా ప్రకాశం, మార్కాపురం జిల్లాల భౌగోళిక స్వరూపం, పారిశ్రామిక హబ్ గా మారుటకు గల అవకాశాలు, పరిస్థితులు, అందుబాటులో ఉన్న వనరులు, పారిశ్రామిక అభివృద్ధి పై డాక్యుమెంట్ రూపకల్పన పై కలెక్టర్ రాజాబాబును ప్రత్యేకంగా అభినందిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం పేదల అభ్యున్నతికి, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కేటాయిస్తున్న నిధులను సద్వినియోగం పరచడమే ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎస్టిమేట్స్ (తరువాయి 4లో...)

## దేవరపల్లి రహదారికి మహర్దశ

### ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషితో
### రూ.1.76 కోట్ల మంజూరు
### ఎమ్మెల్యే ఏలూరికి కృతజ్ఞతలు తెలిపిన ప్రజలు



(షణ్ముఖ వెలుగు, పర్చూరు, ఫిబ్రవరి 4)

ఏళ్ల తరబడి అధ్వాన స్థితిలో ఉన్న దేవరపల్లి రహదారికి ఎట్టకేలకు మహర్దశ పట్టింది. పర్చూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నిరంతర కృషి ఫలితంగా దేవరపల్లి రహదారి బలోపేతానికి రూ.1.76 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా పీఆర్ జీవో ఆర్టి నెంబర్ 64 ని విడుదల చేసింది.దీంతో గ్రామ ప్రజల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.

**ఏపీఆర్ఆర్ఎస్‌పీ ఫేజ్1లో దేవరపల్లికి చోటు...**

రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న ఏపీ గ్రామీణ రహదారుల బలోపేత ప్రాజెక్ట్ ఫేజ్-- 1 కింద ఈ రహదారికి నిధులు మంజూరు అయ్యాయి. పీఆర్ఆర్ గ్రాంట్ ద్వారా 26 జిల్లాలలో రహదారుల

## కోరం లేకుండానే సర్వసభ్య సమావేశం!






- ఫోర్జరీ సంతకాలతోనే సమావేశమా?
- ప్రశ్నిస్తే బయటకు పొమ్మంటారా?
- ఎంపిడిఓ తీరుపై వైస్ ఎంపీపీ తీవ్ర ఆగ్రహం
- సంతకాలతో సరిపెట్టుకుని సమావేశం ముగింపు
- పుల్లలచెరువులో రాజ్యాంగ విరుద్ధ పాలనపై విమర్శలు

(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, ఫిబ్రవరి 4)

పుల్లలచెరువు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం ప్రజాస్వామ్య నిబంధనలను పూర్తిగా విస్మరించి సాగిందని వైసీపీ వైస్ ఎంపీపీ లింగంగుంట్ల రాములు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కోరం లేకపోయినా, ఎంపీటీసీ సభ్యుల హాజరు లేకుండానే సమావేశాన్ని ప్రారంభించడం చట్ట విరుద్ధమని ఆయన ఆరోపించారు. సర్వసభ్య సమావేశం ప్రజా ప్రతినిధుల కోసం నిర్వహించాల్సినదే కానీ, కేవలం అధికారుల సంతకాలతో సమావేశం ప్రారంభించడం ఏ నిబంధన ప్రకారం జరిగిందో ఎంపిడిఓ మరియదాసును ఆయన ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై చర్చ లేకుండా, ప్రజా ప్రతినిధులను పక్కన పెట్టి సమావేశం నిర్వహించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. సమావేశంలో ప్రశ్నలు అడిగిన సభ్యులను బయటకు వెళ్లమని ఆదేశించడం అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అని వైస్ ఎంపీపీ విమర్శించారు. ప్రజా ప్రతినిధులకు ప్రశ్నించే హక్కు ఉంటుందని, కానీ ఇక్కడ ఆ హక్కునే కాలరాస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ లింగంగుంట్ల రాములు మాట్లాడుతూ "సర్వసభ్య సమావేశం అంటే ప్రజల తరఫున మాట్లాడే వేదిక. కానీ ఇక్కడ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఇది పూర్తిగా ప్రజాస్వామ్య వ్యవస్థకు గుదిబండ" అని వ్యాఖ్యానించారు. ఇలాంటి తీరుతో పాలన కొనసాగితే ప్రజలు మౌనంగా ఉండరని హెచ్చరించారు. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామ్య వ్యవస్థలు నిర్వీర్యమవుతున్నాయని వైసీపీ నాయకులు ఆరోపించారు. గ్రామస్థాయి పాలనలో అధికారుల దౌర్జన్యం పెరిగిపోయిందని, ప్రజా ప్రతినిధుల హక్కులను (తరువాయి 4లో...)

## 6,500 మంది విద్యార్థులకు సైకిళ్లు అందజేత

### విద్యార్థులు నడిచే ఇబ్బంది తప్పించేందుకే సైకిళ్ల పంపిణీ
### ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య
### తల్లికి వందనం కోసమే రూ.10,000 కోట్లు ఖర్చు చేస్తున్నాం
### ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఫిబ్రవరి 4)



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఇంటి నుంచి పాఠశాలలకు నడిచి వచ్చే ఇబ్బందిని తప్పించేందుకే సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నియోజకవర్గంలో ప్రారంభించినట్లు ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. అద్దంకి నియోజకవర్గంలోని కొమ్మినేనివారి పాలెం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 105 మందికి, వల్లాపల్లి పాఠశాలకు చెందిన 71 మందికి, అంబడిపూడి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 124 మంది విద్యార్థులకు మంత్రి గొట్టిపాటి బుధవారం సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడారు. ప్రైవేటు విద్యా సంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు వివరించారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలో ఇప్పటి వరకు 6,500 మంది విద్యార్థులకు అసిస్ట్ సేవా సంస్థతో పాటు పలువురు దాతలు అందించిన సీఎస్ఆర్ నిధులతో సైకిళ్లను పంపిణీ చేశామన్నారు. ఉన్నత పాఠశాల విద్యార్థులతో పాటు కొందరు ఇంటర్ విద్యార్థులకు కూడా సైకిళ్లను అందజేసిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి గుర్తు చేశారు. ఒక్కొక్కటి రూ.1.30 లక్షల విలువైన ట్రై సైకిళ్లను కూడా 135 మందికి అందించామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మరో 4000 మంది ఉన్నత పాఠశాల విద్యార్థులకు దశల వారీగా సైకిళ్లను అందిస్తామని వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే (తరువాయి 4లో...)

# నిధులను సద్వినియోగపరచడమే శాసనసభ ఎస్టిమేట్స్ కమిటీ ప్రధాన లక్ష్యం

కమిటీ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రభుత్వం కేటాయిస్తున్న ప్రతి రూపాయి అర్హులైన ప్రజలకు ఉపయోగపడేలా, అలాగే ఎక్కడ అవసరమో అక్కడే నిధులు ఖర్చు చేయాలని, పథకాల ద్వారా పేదలకు ఎంత మేర లాభం చేకూరుతోందో అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. గత ప్రభుత్వ కాలంలో ఇచ్చిన బడ్జెట్ కేటాయింపులపై సమీక్ష నిర్వహించామని, అధికారులు పూర్తిస్థాయిలో బడ్జెట్ను ఖర్చు చేసినట్లు తెలిపారన్నారు. సమావేశంలో పలు అంశాలను తమ దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. రెండు, మూడు రోజుకొకసారి ప్రజలకు తాగునీటి సరఫరా పరిస్థితి సంతృప్తి కరంగా లేదన్న అంశాన్ని, అలాగే సమావేశంలో చర్చించిన అంశాలను స్పీకర్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం పరిశీలించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కమిటీ సభ్యులు మద్దిపాటి వెంకటరాజు మీడియాతో మాట్లాడుతూ సమావేశంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు సంబంధించి 2019-20, 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాల్లో ప్రభుత్వం విడుదల చేసిన బడ్జెట్ కేటాయింపులు, ఖర్చుల వివరాలను ఆయా శాఖల వారీగా సమీక్షించడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనా విధానం, విజన్‌కు అనుగుణంగా ప్రకాశం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేలా జిల్లా కలెక్టర్ రాజాబాబు రూపొందించిన డాక్యుమెంట్ రూపకల్పన అభినందనీయమన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు సక్రమంగా ఖర్చు చేస్తూ, క్షేత్ర స్థాయిలో మార్పు అనేది తీసుకువచ్చి ఆ మార్పు వలన సమాజం అభివృద్ధి పదంలో పయనించేలా సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, డిఆర్డిఏ, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్లు నారాయణ, జోసఫ్ కుమార్, జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, ఉద్యానవనశాఖ అధికారి గోపి చంద్, విద్యాశాఖాధికారి రేణుక, మత్స్య, పశు సంవర్ధక శాఖ జేడీలు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.







## దేవరపల్లి రహదారికి మహర్దశ

బలోపేతానికి ప్రభుత్వం కోట్ల వ్యయంతో పరిపాలనా అనుమతిని ఇచ్చింది. ఈ భారీ ప్రాజెక్ట్‌లో భాగంగానే దేవరపల్లి రహదారి అభివృద్ధికి రూ.1.76 కోట్ల కేటాయింపులు చేసింది. ప్రజా ఇబ్బందులపై ఎమ్మెల్యే ఏలూరి గట్టి పోరాటం దేవరపల్లి రహదారి అధ్వాన్న స్థితిలో ఉండటంతో రైతులు, విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివ రావు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం సంబంధిత శాఖలతో సంప్రదింపులు జరిపిన ఫలితంగానే ఈ రహదారికి నిధులు మంజూరయ్యాయి.


**త్వరలో పనులు... నాణ్యతపై ప్రత్యేక దృష్టి...**

రహదారి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, పురోగతిని ఎప్పటి కప్పుడు పర్యవేక్షించాలని ఎమ్మెల్యే ఏలూరి అధికారులను ఆదేశించారు.దేవరపల్లి రహదారి అభివృద్ధి చెందడంతో గ్రామానికి రవాణా సౌకర్యం గణనీయంగా మెరుగవుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల తరలింపు సులభమవుతుందని, విద్యార్థుల ప్రయాణ కష్టాలు తీరనున్నాయని చెబుతున్నారు.

**ఎమ్మెల్యే ఏలూరికి ప్రజల కృతజ్ఞతలు....**

దేవరపల్లి రహదారికి నిధులు మంజూరు కావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ, ఈ అభివృద్ధికి కారణమైన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు కృతజ్ఞతలు తెలిపారు. "మాటలకే పరిమితం కాకుండా పనుల్లో చూపుతున్న నాయకుడు అంటూ ఏలూరి ని కొనియాడారు.

## అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి




నిర్మిస్తున్న రహదారులు, మరమ్మతులు చేస్తున్న వాటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. గుంతల రహిత రహదారుల నిర్మాణం లక్ష్యంతో పనులు ముందుకు సాగాలన్నారు. సాస్కి పథకం కింద జీవో నెంబర్ 531తో జిల్లాకు మంజూరైన పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. రూ.రెండు కోట్లతో బాపట్ల-పెదనందిపాడు రహదారిని, రూ.రెండు కోట్లతో బాపట్ల-చీరాల రహదారిని, రూ.1.50కోట్లతో తెనాలి-చందోలు రహదారిని, రూ.5.30 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. రూ.4.33 కోట్లతో కర్లపాలెం-గణపవరం, గణపవరం-పెద్దపులుగువారి పాలెం రహదారులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. రూ.ఐదు కోట్లతో మాచవరం-అల్లూరు, రూ.ఒక కోటితో తెనాలి-చందోలు, రూ.మూడు కోట్లతో చందోలు-నిజాంపట్నం, రూ.నాలుగు కోట్లతో బ్రాహ్మణకోడూరు-భట్టిప్రోలు, రూ.2.50 కోట్లతో కుడిపూడి-గోవాడ, రూ.మూడు కోట్లతో బాపట్ల-పర్చూరు, రూ.2.20 కోట్లతో బాపట్ల-పాండురంగాపురం, రూ.2.20 కోట్లతో కంకటపాలెం-మురుకొండపాడు రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. అలాగే వాల్తేరు-జువ్వలపాలెం, రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి అధికారులు డీఈలు నళిని, అరుణకుమారి, రాజేష్, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

## 6,500 మంది విద్యార్థులకు సైకిళ్లు అందజేత









16,300 టీచర్ పోస్టులను భర్తీ చేసి ప్రభుత్వ విద్యను బలోపేతం చేసినట్లు మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. గతంలో ఒక్కో టీచర్ ఐదు తరగతులు చెప్పే వారని, ఇప్పుడు ప్రతి క్లాస్ కూ ఒక టీచర్ ఉన్నారని తెలిపారు. అదే విధంగా అర్హులైన విద్యార్థులు అందరికీ, కుటుంబంలో ఎంత మంది ఉన్నా., ఒక్కొక్కరికీ రూ.15,000 అందిస్తున్నామని చెప్పారు. భారతదేశంలో ఎక్కడా లేని విధంగా తల్లికి వందనం విద్యార్థుల కోసమే రూ.10,000 కోట్లు కూటమి ప్రభుత్వం ఖర్చు చేసిందని అన్నారు. ఒక్కో ఇంట్లో ఇద్దరు విద్యార్థులకు ఆర్థిక సహాయం చేస్తానన్న జగన్మోహన్‌రెడ్డి, ఒక్కరికే సహాయం చేశారని మంత్రి గొట్టిపాటి విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాసిరకం షూలు, యూనిఫాంలు ఇచ్చారని ఆయన ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో నాణ్యమైనవి ఇవ్వడంతో పాటు ప్రతి విద్యా సంవత్సర ఆరంభానికే పుస్తకాలు కూడా అందిస్తున్నామన్నారు.

**పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్...**

సైకిళ్ల పంపిణీ అనంతరం నారాయణ స్కూల్ వారు అందించిన 10వ తరగతి స్టడీ మెటీరియల్‌ను అద్దంకి నియోజకవర్గ పదో తరగతి విద్యార్థులకు మంత్రి గొట్టిపాటి పంపిణీ చేశారు. అద్దంకి నియోజకవర్గం పరిధిలో పదో తరగతి చదివే 2,000 మందికి కూడా ఈ స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు మంత్రి వెల్లడించారు. విద్యార్థులు అందరూ చక్కగా చదువుకుని ఉన్నత స్థానాలకు వెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. అదే విధంగా ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టిన పీ4 పథకం స్ఫూర్తిగా అవకాశం ఉన్న అందరూ సమాజానికి ఎంతో కొంత చేయాలన్నారు. తన విజ్ఞప్తి మేరకు చాలా మంది దాతలు సైకిళ్ల పంపిణీలో భాగస్వాములు అయ్యారని ఈ సందర్భంగా ఆయన వివరించారు. తాను కూడా కొన్ని మండలాల్లోని పాఠశాల విద్యార్థులకు సొంత ఖర్చుతో సైకిళ్లను అందించినట్లు మంత్రి గొట్టిపాటి తెలిపారు. కార్యక్రమంలో కూటమి నేతలతో పాటు పలువురు పాల్గొన్నారు.




## కోరం లేకుండానే సర్వసభ్య సమావేశం!

కాలరాస్తున్నారని విమర్శించారు. ఎలాంటి చర్చలు జరపకుండానే, కేవలం సంతకాలతో సమావేశాన్ని ముగించడం ప్రజల సమస్యలను తుంగలో తొక్కినట్టేనని వైసీపీ నేతలు వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారం పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని, అవసరమైతే ఉద్యమాలకు దిగుతామని హెచ్చరించారు. పుల్లలచెరువు మండలంలో జరిగిన ఈ ఘటన, టీడీపీ ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం ఏ స్థితిలో ఉందో స్పష్టంగా చూపుతోందని వైసీపీ నాయకులు తీవ్ర విమర్శలు గుప్పించారు.



# ఆంధ్రప్రదేశ్‌లో పీఎంకేఎస్‌వై, వ్యవసాయ నీటి పారుదల పథకంపై మాగుంట ప్రశ్న



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 4)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత 5 సంవత్సరాలలో వ్యవసాయ నీటిపారుదల పథకం, ప్రదాన్ మంత్రి క్రిషి సిన్చాయి యోజన పథకం క్రింద వచ్చిన ప్రతిపాదనలు, కేటాయించిన, వాడిన నిధులు, ప్రగతి, లబ్దిదారులు గురించి పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఆయన అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయక మంత్రి రాజ్ భూషణ్ చౌదరి సమాధానమిస్తూ ప్రతి రైతు పొలానికి నీటి సౌకర్యం, నీటి వృధా తగ్గింపు, బిందు, తుంపర సేద్యం, వర్ష నీటి నిల్వ, కొత్త నీటి వనరులు సృష్టి ఏర్పాటు కొరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వ్యవసాయ నీటిపారుదల పథకం, ప్రదాన్ మంత్రి క్రిషి సిన్చాయి యోజన పథకం క్రింద రెండు ప్రధాన భాగాలను కేంద్ర జలశక్తి శాఖ అమలుపరుస్తుందన్నారు. ప్రస్తుతం నీటి పరీవాహక అభివృద్ధి భాగాన్ని "రాష్ట్రీయ క్రిషి వికాష్ యోజన" పథకం క్రింద వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ నిర్వహిస్తున్నదని తెలిపారు. వ్యవసాయ నీటిపారుదల పథకం, ప్రధాన్ మంత్రి క్రిషి సిన్చాయి యోజన పథకం క్రింద ప్రకాశం, అనంతపురం జిల్లాలలో 135 జల వనరుల పునరుద్ధరణకు రూ.70.72 కోట్లు 2021-22 లో మంజూరుచేయబడినదని తెలిపారు. రాష్ట్రీయ క్రిషి వికాష్ యోజన పథకం క్రింద గత 5 సం.లలో రూ. 946 కోట్లతో రాష్ట్రంలో 3,05,279 హెక్టార్లలో తుంపర, బిందు సేద్యం అమలు చేయగా, ప్రకాశం జిల్లాలో 30,419 హెక్టార్లలో జరిగిందని తెలిపారు. పరీవాహక అభివృద్ధి విభాగం క్రింద రాష్ట్రంలో 59 ప్రాజెక్టులకు రూ.360 కోట్లు మంజూరుకాగా, ప్రకాశం జిల్లాలో 8 ప్రాజెక్టులకు రూ. 46 కోట్లు మంజూరయినదని తెలిపారు. మరియు రాష్ట్రంలో 61,776 మంది రైతులు లబ్ది పొందగా, ప్రకాశం జిల్లాలో 6,051 మంది లబ్ది పొందారని తెలిపారు. అన్ని ప్రాజెక్టు పనులను కేంద్ర జల సంఘం పర్యవేక్షిస్తుందని కేంద్ర మంత్రి తెలియజేశారు.

## 180 కళాశాలలకు 40 శాతం నిధులు విడుదల

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 4)

ప్రకాశం జిల్లాలో 245 కళాశాలలకు గాను 180 కళాశాలలు మొదటి విడతగా అంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధుల నుండి 40% నిధులను విడుదల చేసినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులములు, సంక్షేమ, సాధికారత అధికారి ఎన్ లక్ష్మానాయక్ తెలిపారు. షెడ్యూల్డ్ కులముల విద్యార్థులు మొత్తము 15,075 (రెన్యువల్ 9307 + ఫ్రెష్ 5768) మందికి గాను 13,996 మంది విద్యార్థిని విద్యార్థులు అర్హత ప్రమాణాలు పరిశీలన పూర్తి అయిన వారిలో 9,905 మందికి 40% నిధులు విడుదల చేయడమైనది. మిగిలిన 4,091 మంది విద్యార్థిని విద్యార్థులకు రెండు లేదా మూడు రోజులలో సియఫ్ యమ్ఎస్ ద్వారా జమ చేయడ జరుగుతుంది. 860 మంది విద్యార్థిని విద్యార్థులు సచివాలయం ద్వారా పరిశీలన జరుగవలసి యున్నది. మిగిలిన 219 మంది విద్యార్థిని విద్యార్థులు వివిధ కారణాల పరిశీలన జరుగవలసి ఉన్నది. విద్యార్థిని విద్యార్థులకు సచివాలయ పరిధిలో అర్హత పరిశీలన జరుగవలసియున్నది.

కుటుంబం యొక్క వార్షిక మొత్తం ఆదాయం రూ.2.50 లక్షలకు మించకుండా ఉండాలి. కుటుంబం కలిగిన మొత్తం భూమి విస్తీర్ణం తడి భూమి 10 ఎకరాలకు మించకూడదు లేదా పొడి భూమి 25 ఎకరాలకు మించకూడదు లేదా తడి, పొడి భూములు కలిపి 25 ఎకరాలకు మించకూడదన్నారు. కుటుంబ సభ్యుల్లో ఎవరూ ప్రభుత్వ ఉద్యోగి లేదా పెన్షనర్ అయి ఉండకూడదన్నారు. కుటుంబ సభ్యుల్లో ఎవరూ నాలుగు చక్రాల వాహనం కలిగి ఉండకూడదన్నారు. (ప్రభుత్వ ప్రోత్సాహక పథకాల కింద టాక్సీలు, ట్రాక్టర్లు, ఆటోలు పొందిన కుటుంబ సభ్యులకు ఈ నిబంధన వర్తించదు). పట్టణ ప్రాంతాలలో నివసిస్తున్న కుటుంబానికి స్వంత ఆస్తి లేకపోయినా లేదా నివాస, వాణిజ్య భవన విస్తీర్ణం 1500 చదరపు అడుగులలోపు మాత్రమే ఉన్నా అర్హత కలిగి ఉంటారన్నారు. కుటుంబ సభ్యుల్లో ఎవరూ ఆదాయపు పన్ను చెల్లించేవారై ఉండకూడదని తెలిపారు. అర్హత ప్రమాణాలు ధృవీకరణ పూర్తి చేసి తదుపరి నిధులు విడుదల సమయానికి ఉపకరవేతనాలు జమయ్యేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## వసతి గృహాల మరమ్మతు పనులను వేగంగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, ఫిబ్రవరి 4)

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల నిర్మాణం, మరమ్మతు పనులను ఇంజినీర్లు వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. వివిధ శాఖలలో నిర్మిస్తున్న ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులు, మరమ్మతు పనులపై ఇంజినీరింగ్ అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఆయన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ వసతి గృహాలలో మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలలలో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణం నెల రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. వసతి గృహాలకు ప్రహరీ గోడలు, చిన్నచిన్న మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో మూడు ఆటిజం సెంటర్ ల నిర్మాణానికి రూ.60 లక్షలు మంజూరు కాగా అనేది పనులు త్వరగా ప్రారంభించాలన్నారు. భవిత కేంద్రాలకు సామగ్రి సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ కిచెన్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. చీరాల ప్రాంతీయ వైద్యశాల పక్కనే నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ మే నెల నాటికి పూర్తి చేయాలన్నారు. ఆయుష్ శాఖ ద్వారా చేపట్టిన వైద్యశాలల భవన నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్ విజయమ్మ, డిసిహెచ్ఎస్ కోఆర్డినేటర్ పద్మావతి, పిఆర్ డిఈ రాజన్, ఇంజినీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కుష్టు, క్యాన్సర్ రహిత సమాజానికి కృషి చేయాలి



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఫిబ్రవరి 4)

కుష్టు కేన్సర్ లేనీ సమాజ నిర్మాణానికై ప్రతి ఒక్కరు కృషి చేయాలని సంతరావూరు ప్రభుత్వ వైద్యశాల వైద్యులు కె కీర్తి సరోజ్ అన్నారు. మండలంలోని కడవకుదురు గ్రామంలో బుధవారం జరిగిన వికసిత్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సంతరావూరు ప్రభుత్వ వైద్యశాల వైద్యులు కె కీర్తి సరోజ్ అధ్వర్యంలో కుష్టు, కాన్సర్ వ్యాధి పై అవగాహన కార్యక్రమం, ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా సంతరావూరు ప్రభుత్వ వైద్యశాల వైద్యులు కె కీర్తి సరోజ్ మాట్లాడుతూ కుష్టు వ్యాధి మైకో బ్యాక్టీరియా లెప్రే అనే బ్యాక్టీరియా వలన సంక్రమిస్తుందన్నారు. తుమ్ములు, దగ్గు వలన ఈ వ్యాధి వ్యాపిస్తుందన్నారు. చర్మం పై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, నొప్పితో కూడిన నరాలు, కాళ్ల చేతులు బలహీనత, కాళ్ళ నుండి చెప్పులు కారిపోవడం దా పలు లక్షణాలు విసిదీకరించారు. కుష్టు వ్యాధి నివారణకు ప్రభుత్వం ఎండిటి (మల్టీ డ్రగ్ థెరపీ) ద్వారా ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందన్నారు. వైద్య సిబ్బంది వద్ద మందులు ఉచితంగా పొంది డోస్ కచ్చితంగా వాడితే పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. కాన్సర్‌ను ముందస్తు నివారణ, ప్రారంభ దశలోనే గుర్తించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు కె కీర్తి సరోజ్, ఎమ్ఎల్‌హెచ్ కె స్మైలీ, ఎఎన్ఎమ్ కోటేశ్వరమ్మ, ఆశాలు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల విముక్తి రథం ప్రారంభం



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 4)

మార్కాపురం జిల్లా కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయంలో బాల్య వివాహ విముక్తి రథాన్ని ఎమ్మార్వో చిరంజీవి ప్రారంభించారు. సోషల్ యాక్టివిటీస్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ వారు బాల్య వివాహం చట్టరీత్యా నేరమని అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. మనమందరం కలిసి బాల్య వివాహాలను మూలాల నుంచి నిర్మూలించి బాలల హక్కులను కాపాడుదాం అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మర్షి యలవర్తి ఆంజనేయ శాస్త్రి 149వ జయంతోత్సవ వేడుకలు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 4)

ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ పురోహిత పరిషత్ ఆధ్వర్యంలో ఒంగోలు కర్నూల్ రోడ్ సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రక్కన శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయంలో, పామూరు, కనిగిరి మండలాలలో పండిత బ్రహ్మర్షి యలవర్తి ఆంజనేయ శాస్త్రి గురుదేవులు 149వ జయంతోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యలవర్తి ఆంజనేయ శాస్త్రి స్ఫూర్తిగా పలువురికి వేద పాఠశాల ఉపాధ్యాయులకు వాస్తు పండితులకు సత్కారం చేసారు. ఈ సందర్భంగా ప్రకాశంజిల్లా విశ్వబ్రాహ్మణ పురోహిత పరిషత్ తరఫున 60 సంవత్సరాలు దాటిన వారికి నెలకు రూ.500 వృద్ధాప్య పింఛన్లు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పోతులూరి శివబ్రహ్మాచార్యులు, ప్రధాన కార్యదర్శి కడియంపాటి గౌరీ శంకర్, కార్యనిర్వాహక అధ్యక్షులు వేల్పూరి రామారావు, కోశాధికారి నూతక్కి శివకృష్ణమాచార్యులు, గౌరవ సలహాదారులు ఫణిదపు బ్రహ్మయ్యాచార్యులు, గౌరవ సలహాదారులు చిడిపోతు శ్రీనివాసరావు, కందుకూరి శ్రీనివాసాచార్యులు, ఉపాధ్యక్షులు ఉప్పులూరి చిన్న బ్రహ్మయ్యాచార్యులు, కార్యాలయ కార్యదర్శి పాలెపు వెంకటేశ్వరశర్మ, ఇంకొల్లు మధుసూదనాచార్య, సహాయ కార్యదర్శి కోవూరి జగదీశ్వరాచార్యులు, వేద సంస్కృత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆకుమళ్ళ మోహన్‌రావు, ఉపాధ్యక్షులు ఊటుకూరి దివ్యాచార్యులు, కందేపు సుబ్రహ్మణ్యాచార్యులు, తదితర పురోహితులు సంఘ నాయకులు పాల్గొన్నారు. సహకరించిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు.

## దాతలు ముందుకు రావడం అభినందనీయం

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 4)

జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'బాపట్ల సేవా సేతు' కార్యక్రమానికి ప్రజలు, వివిధ సంఘాలు, ఉద్యోగుల నుంచి లభిస్తున్న స్పందన అభినందనీయమని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని న్యూ వీసీ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ వైద్యులు, ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు, వైద్యులు ,చీరాల,రెపల్లే ,బాపట్ల ఐఎంఏ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పనకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. 'బాపట్ల సేవా సేతు' వెబ్‌సైట్‌లో ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన మౌలిక వసతుల వివరాలు పొందుపరిచినట్లు తెలిపారు. దాతలు వెబ్‌సైట్ ద్వారా అవసరాలను తెలుసుకొని నేరుగా ఆన్‌లైన్ ద్వారా సహాయం చేయవచ్చని, లేదా సంబంధిత అధికారులకు నేరుగా అందించవచ్చని చెప్పారు. అందిన వస్తువుల బిల్లులు, వివరాలు, ఉపయోగంలో ఉన్న స్థితి తదితర సమాచారం మొత్తం వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేయడం జరుగుతుందన్నారు. దాతల సహకారం పూర్తిగా పారదర్శకంగా ప్రదర్శించబడుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా చీరాల ఐఎంఏ బ్రాంచ్ వారు ప్రింటర్‌ను అందజేయగా, చీరాల ఐకాన్ ఆసుపత్రికి చెందిన డాక్టర్ కొండల్‌రావు, సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులకు దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ, డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మావతి, ఎన్టీఆర్ ఆరోగ్యసేవ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రత్యేక కార్యాచరణ

**జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు**
**జాతీయ రహదారుల పై ప్రమాదాల నియంత్రణకు రోడ్డు సేఫ్టీ టీమ్స్ ఏర్పాటు**
**హైవేలపై అతివేగ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక**
**జిల్లాలో రోడ్డు ప్రమాదాల తగ్గింపే లక్ష్యంగా సమావేశం**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 4)**


రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో గుండా వెళ్లే ఏడు జాతీయ రహదారుల పై రోడ్డు భద్రతను మరింత పటిష్టం చేయడానికి ప్రత్యేకంగా రోడ్డు సేఫ్టీ టీమ్స్ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. జాతీయ రహదారుల వారీగా ఏర్పాటు చేసిన టీమ్స్ వివరాలు ఎన్‌హెచ్16-8 టీమ్స్, ఎన్‌హెచ్ 216-2 టీమ్స్, ఎన్‌హెచ్ 544-8 టీమ్స్, ఎన్‌హెచ్ 565-8 టీమ్స్, ఎన్‌హెచ్ 765- 2 టీమ్స్, ఎన్‌హెచ్ 340-1 టీమ్, ఎన్‌హెచ్167-5 టీమ్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ రోడ్ సేఫ్టీ టీమ్స్‌లో పోలీసులు, 1033 సిబ్బంది, టోల్ ప్లాజా సిబ్బంది, ఆర్టీఏ అధికారులు, అలాగే మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్ (108 సేవలు)కు సంబంధించిన అధికారులు సభ్యులుగా ఉంటారని జిల్లా ఎస్పీ తెలిపారు. జాతీయ రహదారుల పై ఉన్న టోల్ ప్లాజాలు, బస్సులు-లారీలు నిలిపే రెస్ట్ ఏరియాలు, ఎమర్జెన్సీ పార్కింగ్ ప్రదేశాలు, అనధికార పార్కింగ్ ప్రాంతాలు, బ్లాక్ స్పాట్స్, సర్వీస్ రోడ్డుల నుండి ప్రధాన రహదారికి కలిసే ప్రాంతాలు, అలాగే స్ట్రెట్ గా 5 కిలోమీటర్ వరకు ఉన్న




రోడ్డుపై అతివేగ నియంత్రణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై మరియు హైవే పై ఉన్న హోటళ్లు, డాబాల వద్ద తప్పనిసరిగా ఏర్పాటు చేయాల్సిన వాటి గురించి జిల్లా ఎస్పీ అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. ఆయా ప్రదేశాలలో సీసీ కెమెరాలు, పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టమ్, కాన్వెక్స్ మిర్రర్లు, తగినంత లైటింగ్, రంబుల్ స్ట్రిప్స్ (లైన్స్), ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సర్వీస్ రోడ్డుల నుండి ప్రధాన రహదారికి కలిసే ప్రాంతాల్లో ఇసుక డ్రమ్ములు, స్పీడ్ బ్రేకర్లు, ఇల్యూమినేషన్ ఏర్పాటు చేసి, ప్రమాదాలకు అవకాశం లేకుండా తక్షణమే అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నియంత్రించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బి ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరావు, డిసిఆర్బీ ఇన్స్‌పెక్టర్ దేవప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతులు అందజేసిన కలెక్టర్







**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 4)**

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ బహుమతులు అందజేశారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ, డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మావతి, ఎన్టీఆర్ ఆరోగ్యసేవ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

## మహిళలకు చీరలు పంపిణీ



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 4)**

మార్కాపురం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ తరపున మున్సిపల్ పారిశుద్ధ కార్మికులకు 180 మందికి మహిళలకు చీరలు మగవారికి ప్యాంటు షర్టు ఇవ్వడం జరిగింది. ఈ కార్య క్రమాన్ని ఉద్దేశించి అధ్యక్షులు గుంటక సుబ్బారెడ్డి, కార్యదర్శి అన్నా రాము మాట్లాడుతూ సంస్థ తరుపున బాడీ ఫ్రీజర్స్, వైకుంఠ రథం, ఆక్షన్ మిషన్స్, పర్యావరణ పరిరక్షణ, ఆత్మీయ సహకారం, విద్యార్థులకు నైతిక విలువలు కార్యక్రమాల తోటి ముందుకెళ్తున్నామన్నారు. దీనిలో భాగంగా పారిశుధ్య కార్మికులకు అందరికీ బట్టలు పెట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి తడికమల్ల శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, కమిషనర్ నారాయణరావు, జిల్లా అధ్యక్షులు యలమందరెడ్డి, కన్వీనర్ సోమిశెట్టి శ్రీనివాసులు, కార్యదర్శి కపురం శ్రీనివాస్‌రెడ్డి, గుంటక వనజాక్షి చెన్నారెడ్డి, సూరే వెంకటేశ్వర్లు, పాలెం చెంచయ్య, మున్సిపల్ మేనేజర్ అనుముల ఆంజనేయులు, గోరంట్ల చిన్న వెంకట్‌రెడ్డి, బచ్చు సుబ్రమణ్యం, పివి కృష్ణారావు, కలువ భాస్కర్, గంగిశెట్టి కిరణ్, మార్కాపురం మానవత స్వచ్ఛంద సేవ సంస్థ కమిటీ సభ్యులు, 86-87 బ్యాచ్ మిత్రులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పొలం పిలుస్తుంది






సూదనగుంట, తుమ్మగుంట గ్రామాల్లో బుధవారం వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా దర్శి సహాయ వ్యవసాయ సంచాలకులు బాలాజీ నాయక్ పాల్గొని కంది పంటను పరిశీలించారు. పంట దిగుబడి పురుగులు ప్రభావం తదితర అంశాల పై రైతులతో నేరుగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంది కొనుగోలు కేంద్రం వచ్చే వారం నుంచి ప్రారంభం కానున్నట్లు తెలిపారు. కనుక కంది రైతులు పంటను ప్రభుత్వ మద్దతు ధరకు క్వింటా రూ.8000 లకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించేందుకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అందుకోసం ప్రతి రైతు తమ సమీపంలోని రైతు సేవ కేంద్రాన్ని సంప్రదించి సీఎం యాప్ నందు, పొలం పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు వివరాల ఆధారంగా ఈకేవైసీ పూర్తి చేసి నమోదు చేయించుకోవాలని తెలిపారు. మండల వ్యసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు రైతులకు మట్టి పరీక్షలు నమూనా సేకరణ విధానం, మట్టి పరీక్ష వల్ల కలిగే ప్రయోజనాలు, పంటకు అవసరమైన పోషకాల పై అవగాహన కల్పించారు. మట్టి పరీక్ష ఆధారంగా సరైన ఎరువులు వినియోగించుకుని చేస్తే దిగుబడి పెరుగుతుందని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన సహాయకురాలు, ఆయా గ్రామ రైతులు పాల్గొన్నారు.

## కోదండ రామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఆర్ఎంపి వైద్యులు యర్రం వెంకటరెడ్డి దంపతులు

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 4)**

కోదండ రామస్వామి 26వ వార్షికోత్సవం సందర్భంగా ఆరో రోజు బుధవారం భక్తిశ్రద్ధలతో హనుమంత వాహన నగరోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉభయ దాతలు రెడి జేఏసి డాక్టర్స్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఆర్ఎంపి వైద్యులు యర్రం వెంకటరెడ్డి, పార్వతి దంపతులను అక్షింతలను మేళ తాళాలతో ఆలయ కమిటీ నిర్వహకులు ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం స్వామి, అమ్మ వార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి ఆలయ కార్య నిర్వహకులు వెంకటరెడ్డి దంపతులకు వస్త్రాలు, స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోదండ రామస్వామి ఆలయ ప్రెసిడెంట్ ఓబులశెట్టి సత్యనారాయణ, ట్రెజరర్ శనగపల్లి నాగేశ్వరరావు, సెక్రటరీలు మలిశెట్టి వరదరాయుడు, తదితరులు పాల్గొన్నారు.





## మెటీరియల్ షీట్ జనరేషన్ చేసి పేమెంట్ చేయాలి



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఫిబ్రవరి 4)**

స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో డాక్టర్ పి సుజాత ఆధ్వర్యంలో ఉపాధి హామీ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మెటీరియల్ పేమెంట్ కింద పని చేసిన రైతుల గోకులం షెడ్ల పనులు, పశువుల నీటి తొట్టెలు, ఇంకుడు గుంతలు పండ్ల తోటల పేమెంట్ ల గురించి రాబోయే 20 రోజుల్లో ప్రతి పనికి మెటీరియల్ షీట్ జనరేషన్ చేసి పేమెంట్ చేయాలని తెలిపారు మండలంలోని అన్ని గ్రామపంచాయతీ పరిధిలో పనులకు పోకుండా ఉండేవారికి ఉపాధి పనులు కనిపించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సుధాకర్, ఈసీ కోటేశ్వరరావు, టిఏలు పాల్గొన్నారు. 7న తర్లుపాడులో

## రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి పెద్ద సైజు ఎడ్ల పోటీలు

**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఫిబ్రవరి 4)**

శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఒంగోలు జాతి వృషభ రాజముల బల ప్రదర్శన పోటీలు మండల కేంద్రమైన తర్లుపాడు గ్రామంలో ఫిబ్రవరి 7వ తేదీన జరుగుతాయని కమిటీ కార్యనిర్వాహకుడు కోలగట్ల కాశీశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పాత్రికేయులకు తెలియజేశారు. గెలుపొందిన ఎడ్ల జతలకు మొదటి బహుమతి రూ.70వేలు, రెండవ బహుమతి రూ.50 వేల రూపాయలు, మూడవ బహుమతి రూ.40 వేలు, నాల్గవ బహుమతి 30వేల రూపాయలు, ఐదవ బహుమతి 20వేల రూపాయలు,ఆరవ బహుమతి 10 వేలరూపాయలు, ఏడవబహుమతి5వేలరూపాయలు సందర్భాన్ని బట్టి కన్సోలేషన్ బహుమతులు కలవు. మరిన్ని వివరాలకు ఈక్రిందతెలియపరిచినసెల్నెం బర్లవారినిసంప్రదించగలరు. వెన్నా చిన్నసత్యనారాయణరెడ్డి సెల్ నెంబర్ 9440791698, కుందురు చిన్నకాశిరెడ్డి సెల్ నెంబర్ 9951251960లను సంప్రదించి ఏడో తేదీ డ్రాలోపు ఒక్కొక్క జతకు వెయ్యి రూపాయల డిపాజిట్చెల్లించి పేర్లను నమోదుచేసుకోవాలని తెలియజేశారు.

## సీడ్ క్యాపిటల్ లబ్ధిదారులకి కెపాసిటీ బిల్డింగ్ పై శిక్షణ




**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 4)**

మార్కాపురంలోని డ్వాక్రా బజార్ నందు మార్కాపురం ఎర్రగొండపాలెం పుల్లలచెరువు సీడ్ క్యాపిటల్ 62 మంది లబ్ధిదారులకి కెపాసిటీ బిల్డింగ్ పై శిక్షణ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో డిపిఎం లైవ్లీహుడ్ డి దానం మాట్లాడుతూ సీడ్ క్యాపిటల్ లబ్ధిదారులు వారి ఆక్టివిటీస్ ని సక్రమంగా నిర్వహించుకోవాలి. అదే విధంగా లీగల్ కంప్లైంట్స్‌కు సంబంధించి ఉద్యమ రిజిస్ట్రేషన్, ఫసాయ్ సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. ఎన్ఆర్ఎల్ఎం పోర్టల్, ఏపీ మాస్ మొదలగు సైట్లలో అప్లోడ్ చేసి చట్టబద్ధత కలిగి ఉండాలని తెలియజేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో స్థానిక మార్కాపూర్ ఏపిఎం పిచ్చయ్య, నాన్ ఫార్మ్ సిఆర్పి, సీసీ నాగయ్య, నాగభూషణం, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## భీమవరం గ్రామంలో పొలం పిలుస్తుంది

### మండల వ్యవసాయ అధికారి డి విజయ్ కుమార్




**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 4)**

మండలంలోని భీమవరం గ్రామంలో బుధవారం మండల వ్యవసాయ అధికారి డి విజయ కుమార్ ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ పంట వేసిన ప్రతి రైతు విధిగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. అందుకు సంబంధించి మీ పొలం పాస్ బుక్, ఆధార్, మొబైల్ నెంబర్‌తో మీ గ్రామంలోని వ్యవసాయ సహాయకులను కలవాలని తెలియజేశారు. పంట నమోదు చేసుకున్నావారికి మాత్రమే ప్రభుత్వం ద్వారా వచ్చు రాయితీ లు వినియోగించుకొనే అవకాశం ఉంటుంది అని అలాగే వరి పంట ప్రభుత్వం వారు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో అమ్ముకొనుటకు, అలాగే ప్రభుత్వం వారు అందించు పంట మద్దతు ధర పొందేందుకు వీలు ఉంటుందని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సురేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ పై విద్యార్థులకు అవగాహన



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఫిబ్రవరి 4)**

మండలంలోని చెరువు కుమ్ము పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శైలజ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య అధికారి రవి కిరణ్ మాట్లాడుతూ శరీరంలో ఎక్కడైనా కణజాలం అవసరం లేకుండా విపరీతంగా పెరిగిపోవడమే క్యాన్సర్ అని పేర్కొన్నారు. ఆహార అలవాట్లు, రేడియేషన్, దోమపానం, ఉబకాయం తదితరాలు క్యాన్సర్ కు కారకాలని తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి ఆరోగ్యం పై విధిగా దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ జాంబవంత నగర్ రామాలయ నిర్మాణ, విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి ఆర్థిక చేయూతనివ్వండి

(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఫిబ్రవరి 4)



మున్సిపాలిటీ కార్మికులు నివాసముంటున్న జాంబవంత నగర్‌లోని కోదండ రామాలయాన్ని నిర్మాణం విగ్ర ప్రతిష్టకు బద్వేల్ ప్రాంత ప్రజలు, నాయకులు ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందజెయాలని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక 2వ వార్డు, జాంబవంత నగర్ నందు గల రామాలయ ఆవరణం నందు శ్రీ కోదండ రామస్వామి ఆలయ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కాలువ నాగేంద్రబాబు, కాలనీవాసులు మాట్లాడుతూ బద్వేలు మున్సిపాలిటీ, 2వ వార్డు శ్రీ జాంబవంత నగర్ నందు దాదాపు 70 కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నామని, మేమంతా ఎస్సి మాదిగ కులానికి చెందిన నిరుపేదలమని, మేమంతా బద్వేలు పురపాలక సంఘము నందు అత్యల్ప జీతాలకు అవుట్సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులుగా పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నామని, తమ కాలనీలో పండుగలు, ఉత్సవాలు దైవ కార్యక్రమాలు నిర్వహించుకొనుటకుగాను 2011 సంవత్సరంలో శ్రీ కోదండ రామస్వామి దేవస్థానాన్ని నిర్మించాలని తలచి కాలనీవాసులు చందాలు పోగుచేసుకొని బేసుమట్టం, గోడలు,గర్భగుడి, మండపానికి స్లాబు వేసుకొని ఆర్థిక వనరులు లేక దేవస్థాన నిర్మాణ పనులు నిలిచిపోయి దాదాపు ఆరు సంవత్సరాలు కావస్తున్నదని, దేవస్థాన నిర్మాణం పూర్తికాక దేవస్థాన పరిసరాలు అద్వాన స్థితిలో ఉన్నాయని, కాలనీవాసులు దైవ కార్యక్రమాలు నిర్వహించుకొనుటకు సరైన వసతి సౌకర్యాలు లేక దీనస్థితిలో కార్యక్రమాలు చేస్తున్నామని తమ ఆవేదన వ్యక్తం చేశారు. సదరు దేవస్థానం పూర్తి నిర్మాణమునకు సిమెంటు ప్లాస్టింగు, కరెంటు వైరింగ్, గర్భగుడిలోనికి రాతి విగ్రహాలు,ఉత్సవ విగ్రహాలు, స్వామి వారికి గొడుగులు, మండపంలోనికి గ్రానైట్ పరుపు, సైడ్ గోడలకు టైల్స్,రాజగోపురం, పెయింటింగ్, నీటి వసతికై ట్యాంకు, దైవ కార్యక్రమాలను ప్రచారం చేయుటకు మైక్ సెట్ మరియు స్వామివారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం చేయుటకు గాను దాదాపు పది లక్షల రూపాయలు అవసరం ఉన్నది. శ్రీ కోదండ రామస్వామి ఆలయ నిర్మాణ అభివృద్ధి కొరకు వల్లంకొండు వెంకటరమణ, కె వి సుబ్బారావు, చెన్నంపల్లె రామకోటి రాజు, పెద్ది సుధాకర్, బ్రహ్మదేవుని యర్రం రెడ్డి, పబ్బతి చంద్రశేఖర్, ఈగ సుబ్బారెడ్డి, బత్తల సునీల్ కుమార్, సి వి నాగేశ్వరరావు, పెద్దినేని వీర కామేశ్వరరావులతో పాటు కాలనీ పెద్దలు కమిటీగా ఏర్పడి పలువురి దాతలను సంప్రదించగా దేవస్థానంలో మండపంలో గ్రానైట్ పరుపు కొరకు మానవతా సేవా సంఘం అధ్యక్షులు నాగిరెడ్డి శంకర్ రెడ్డి బాధ్యత తీసుకున్నారని, ప్రముఖ శివ టెక్స్ టైల్స్ యజమాని తులసి వెంకట శివ నారాయణ రూ.51,116, విగ్ర ప్రతిష్ట మహోత్సవానికి సంబంధించిన దాదాపు రూ.80,000 వరకు పూర్తిస్థాయిలో తోడేటి సుబ్బయ్య యాదవ్ (ఎన్నారై) ప్రముఖ టిడిపి నాయకులు నాగిరెడ్డి జనార్దన్‌రెడ్డి రూ.50,000, కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ రూ.50,116 పొన్నవోలు బ్రహ్మానందరెడ్డి రూ.30,116, ప్రకాశం జిల్లా కొమరోలుకు చెందిన ప్రసాద్ రూ.25,116 ప్రముఖ కాంట్రాక్టర్ అన్నంరెడ్డి రమణారెడ్డి రూ.20,116 అలాగే 34 అవార్డు ఇన్చార్జ్ బిజ్జం రమణ 100 బస్తాలు సిమెంట్‌లో మరి కొంతమంది దాతలు ముందుకు వచ్చారని అలాగే ఈ దైవ కార్యక్రమం పరిపూర్ణం కావాలంటే మరి కొంతమంది దాతల సహకారం అవసరం ఉన్నదని కావున బద్వేలుపట్టణం, నియోజకవర్గ స్థాయిలో ఉన్న హిందూ బాంధవులందరూ జాంబవంత నగర్ ఎస్సీ కాలనీలో ఆలయ నిర్మాణ, విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలకు తోడ్పాటు అందించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. అలాగే ఆలయ పైన ఉన్నటువంటి విద్యుత్ తీగలను తొలగించాలని పలువురి కమిటీ సభ్యులు టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి రితేష్‌రెడ్డిని కలిసిన వెంటనే సంబంధించిన విద్యుత్ లైన్మెన్లు రమేష్, చంద్ర, విద్యుత్ కాంట్రాక్టర్ శ్రీరాములురెడ్డి ఆలయం పైన ఉన్నటువంటి విద్యుత్ వైర్లను పరిశీలించారు. రెండు రోజుల్లో విద్యుత్ తీగలరని తొలగిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఇందుకు సహకరించిన రితేష్‌రెడ్డికి పలువురు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.







# లక్నోలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో డాక్టర్ ఏలూరి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 4)

ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆధ్వర్యంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, ఎసార్పీ ల్యాబొరేటరీస్ చైర్మన్, బీజేపీ మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫార్మా రంగంలో పెట్టుబడుల అవకాశాల గురించి చరించారు. సీఎంతో కలిసి లంచ్ మీటింగ్, పారిశ్రామికవేత్తలతో ఫోటో సెషన్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏలూరి మాట్లాడుతూ లక్నోలో జరిగిన పారిశ్రామిక సదస్సులో ఫార్మా, మెడికల్ డివైజస్ అభివృద్ధి, ఉపాధి సృష్టిపై విస్తృతంగా చర్చించినట్టు తెలిపారు. విజన్‌తో కూడిన పాలన, పరిశ్రమలకు అనుకూల విధానాలు, మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా ఉత్తరప్రదేశ్‌ను పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దుతున్న సీఎం యోగి నాయకత్వం నిజంగా ప్రశంసనీయం అని కొనియాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో పెద్దఎత్తున ఫార్మా అభివృద్ధి జరుగుతోందని దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసిన బల్క్ డ్రగ్ పార్కుల ద్వారా చైనా సహా పలు దేశాల నుంచి ఏపిఐలను దిగుమతి చేసుకునే అవసరం తగ్గుతోందని అన్నారు. ముఖ్యంగా ఆత్మనిర్భర్ భారత్, మేక్ ఇన్ ఇండియా విజన్ వల్ల భారత్ ఈ రోజు ప్రపంచంలోనే ప్రముఖ ఫార్మాస్యూటికల్ తయారీ దేశాల్లో ఒకటిగా ఎదిగిందని తెలిపారు. ఔషధ ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించడమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా బల్క్ డ్రగ్ పార్కులు, ఫార్మా క్లస్టర్లు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ దిశలోనే సీఎం యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో ఉత్తరప్రదేశ్‌లోని లలిత్‌పూర్‌లో 1,472 ఎకరాల్లో బల్క్ డ్రగ్ పార్క్ రూపుదిద్దుకుంటోందని ఏలూరి అన్నారు. ఈ పార్క్ ద్వారా ఏపిఐ దిగుమతులపై ఆధారాన్ని తగ్గించి, దేశీయ ఫార్మా పరిశ్రమను మరింత బలోపేతం జరుగుతోందని చెప్పారు.. ప్లగ్-అండ్-ప్లే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, జీరో లిక్విడ్ డిశ్చార్జ్ వంటి ఆధునిక సదుపాయాలతో రూ.12,000 కోట్లకు పైగా పెట్టుబడులు, వేలాది ఉద్యోగ అవకాశాలు ఏర్పడనున్నాయని అన్నారు. దీని ద్వారా ఉత్తరప్రదేశ్ మాత్రమే కాదు, మొత్తం భారత్ ఫార్మా రంగంలో గ్లోబల్ లీడర్‌గా ఎదగడం ఖాయమని ఏలూరి రామచంద్రారెడ్డి అన్నారు.

# ఫిబ్రవరి 12న కార్మిక, కర్షక సమ్మెలో వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలి

## వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 4)

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. బుధవారం ప్రజాసంఘాల కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఫిబ్రవరి న 12 జరిగే సార్వత్రిక సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ కార్మిక వర్గం స్వాతంత్రానికి పూర్వం నుండి అనేక పోరాటాలు త్యాగాల ద్వారా 29 చట్టాలను సాధించుకున్నదని తెలిపారు. మోడీ ప్రభుత్వం అమానుషంగా ఆ చట్టాలను నిర్వీర్యం చేసి 4 కోడ్లుగా కుదించిందని తెలిపారు. దానికి అనుగుణంగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచిందని అన్నారు. వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభంలోకి కూరుకుపోతున్నదని అమెరికా ప్రభుత్వం ఆంక్షలు లేని వ్యవసాయ ఉత్పత్తులను దేశంలో దిగుమతి చేస్తున్నదని అన్నారు. ఈ పరిస్థితులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తాయని అన్నారు. కనీస మద్దతు ధరలు చట్టం కల్పించకపోతే రైతన్న ఆత్మహత్యలు మరింత పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేస్తారు. వ్యవసాయ రంగం మీద ఆధారపడి బ్రతుకుతున్న వ్యవసాయ కూలీలకు తీవ్ర ఇబ్బంది కర పరిణామాలు దాపరిస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాస్త కూస్తో గ్రామీణ పేదలకు ఆసరాగా ఉన్న మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసి కొత్త చట్టం తెచ్చిందని అన్నారు. రాష్ట్రాల మీద భారాలు మోపే ఈ చట్టాన్ని మన రాష్ట్రంలోని ఎంపీలందరూ సమర్థించడం దుర్మార్గం అని అన్నారు. పాత ఉపాధి హామీ చట్టం పునరుద్ధరణ కోసం ఉద్యమిస్తామని అన్నారు. కార్మిక కర్షక, కష్టజీవుల సంఘాలు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలు కాపాడుకునేందుకు ఫిబ్రవరి 12న చేస్తున్న సార్వత్రిక సమ్మెలో వ్యవసాయ కార్మికులంతా భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కెజి మస్తాన్, గుమ్మా బాలనాగయ్య, వెల్లంపల్లి ఆంజనేయులు, కంకణాల వెంకటేశ్వర్లు, తన్నీరు సుజాత, వి మోజెస్, కొమ్మాలపాటి మాల్యాద్రి, ఉబ్బా వెంకటేశ్వర్లు, బడుగు జనార్ధన్, తురక ఏడుకొండలు, జి రాములు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో పారిశుద్ధ్య కార్మికుడికి తీవ్ర గాయాలు

## సీఐటీయూ నాయకుల పరామర్శ



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 4)

పొదిలి పట్టణంలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో నగర పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు తీవ్రంగా గాయపడిన సంఘటన జరిగింది. పుచ్చలపాలెం గ్రామానికి చెందిన నగర పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ సిహెచ్ రామయ్య విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా దర్శి రోడ్డులోని బుచ్చనపాలెం అడ్డరోడ్డు వద్ద వేగంగా మోటార్ సైకిల్ పై వస్తున్న మరొక యువకుడు వచ్చి ఢీకొట్టాడు. ఈ సంఘటనలో ఒకసారిగా రోడ్డు పై పడిపోయిన రామయ్య కంటికి బలమైన గాయమైంది. రోడ్డుమీద పడిపోవడంతో నడుములు బాగా దెబ్బతిన్నాయి. కదలలేని పరిస్థితిలో 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. ఈ సందర్భంగా ఒంగోలు వెంకటరమణ వైద్యశాలలో చికిత్స పొందుతున్న రామయ్యను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్, పొదిలి నగర పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు నగేష్, నగర పంచాయతీ వర్కర్స్ యూనియన్ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు నర్రా వెంకటేశ్వరరెడ్డి బాధితుడిని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

## వంగవీటి రంగా ఆశయాల కోసం కృషి చేయాలి

### రాష్ట్ర కాపు సంఘం నాయకులు శాసనాల





(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 4)

ఉమ్మడి రాష్ట్రంలో ప్రజల హృదయాల్లో చిర స్థాయిగా నిలిచిపోయిన స్వర్గీయ వంగవీటి రంగా ఆశల కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాష్ట్ర కాపు సంఘం నాయకులు, టిడిపి రాష్ట్ర పరిశీలకులు శాసనాల వీర బ్రహ్మం పిలుపు నిచ్చారు. రంగా విగ్రహావిష్కరణ కార్యక్రమం బుధవారం కురిచేడు మండలం పొట్లపాడు గ్రామంలో రంగా అభిమానుల మధ్య కోలాహలంగా, వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శాసనాల మాట్లాడుతూ రాష్ట్రంలో కాపులకు ప్రత్యేకమైన గుర్తింపు, గౌరవం తీసుకొని వచ్చిన గొప్ప వ్యక్తి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అని అన్నారు. అలాగే రాష్ట్రంలో కాపులు, బలిజలు 30 శాతం ఉన్నప్పటికీ రాజకీయంగానూ, ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లోనూ తగిన ప్రాతినిధ్యం లేకపోవడం చాల బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాపుల్లో ఐక్యత ఎంతైనా అవసరమని అన్నారు. రంగా మృతి చెంది 4 దశాబ్దాలుగా గడుస్తున్నప్పటికీ నేటికి ప్రజల్లో ఏ మాత్రం ఆదరణ తగ్గకపోగా రోజు రోజుకు మరింత పెరుగుతుందని అన్నారు. దీన్ని బట్టి రంగా ప్రజలతో ఎంత మమేకం అయ్యారో అర్థమవుతుందని ఆయన అన్నారు. రంగా ఆశయాలను గ్రామ గ్రామాన ప్రచారం చేయాలని రాష్ట్ర కాపు సంఘం నాయకులు, టిడిపి పరిశీలకులు శాసనాల వీరబ్రహ్మం ప్రజలకు పిలుపునిచ్చారు. స్వర్గీయ వంగవీటి రంగా విగ్రహావిష్కరణ కార్యక్రమం అనంతరం సభ నిర్వాహకులు యాదగిరి పుల్లయ్య ఆధ్వర్యంలో వంగవీటి రంగా కుమారుడు రాధ రాష్ట్ర కాపు సంఘం నాయకులు శాసనాల వీరబ్రహ్మంకి మెమంటో అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## స్వదేశీ దర్శన్ పర్యాటకం అభివృద్ధితో స్వర్ణ బాపట్లగా రూపుదిద్దుకోనుంది

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 4)

స్వదేశీ దర్శన్ పర్యాటకం అభివృద్ధితో స్వర్ణ బాపట్లగా రూపుదిద్దుకోనుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. స్వదేశీ దర్శన్ పర్యాటక రంగం



అభివృద్ధిపై అనుబంధ శాఖల అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్ నుంచి హైబ్రిడ్ మోడ్ లో ఆయన సమావేశం నిర్వహించారు. పర్యాటక రంగం అభివృద్ధి పనులలో వేగం పెంచాలని సంబంధిత అధికారులు, గుత్తేదారులను కలెక్టర్ ఆదేశించారు. పర్యాటక రంగం ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో వినియోగంలో తెస్తే బాపట్ల అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. సూర్యలంక వద్ద ఏర్పాటు చేస్తున్న స్వదేశీ దర్శన్ అభివృద్ధి పనులు వేగం పుంజుకోవాలన్నారు. హౌస్ బోట్ నిర్మాణం త్వరగా పూర్తి చేస్తే పర్యాటకుల సంఖ్య మరింత పెరుగుతుందన్నారు. అభివృద్ధి పనులలో జాప్యం ఉండరాదన్నారు. అభివృద్ధి పనులను పరిశీలించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాపట్ల జిల్లాకు వచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లా అభివృద్ధికి నా వంతుగా ఏం పని చేస్తున్నానని అధికారులు పునరాలోచించుకోవాలన్నారు. నాణ్యతతో పనులు జరగాలని, అధికారులంతా సమన్వయంతో విధులు నిర్వహిస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కు నిర్మాణం పది నెలల్లో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆక్వా పార్కు ద్వారా పర్యాటక ప్రాంత మరింత ఉపందుకుంటుందన్నారు. గుత్తేదారులు బాధ్యతతో పనిచేయాలన్నారు. జిల్లా అభివృద్ధికి ఈ ప్రాంతం కీలకం కానుందన్నారు. పనుల పురోగతిపై క్షుణ్ణంగా ఆయన సమీక్షించారు. ఈ సమావేశంలో మత్స్య శాఖ డిడి గాలి దేముడు, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు, అనుబంధ శాఖల అధికారులు, గుత్తేదారులు, తదితరులు పాల్గొన్నారు.

# అకుంఠిత దీక్షా.. దక్షతకు నిదర్శనం...

## నటుడు నాని

**నటనలో ఓనమాలు తెలియని వారి నుంచి నటనను రాబట్టిన వైనం**
**కష్టాల కడలిని దాటి... 'ప్రేమ కడలి' వరకు ప్రయాణం**
**మొదటి సినిమాతో సవ్యసాచిగా వ్యవహరించిన పిల్లిబోయిన నాని**











(షణ్ముఖ వెలుగు, గోపవరం, ఫిబ్రవరి 4)

స్వామి వివేకానందుడు లక్ష్యం గురించి వివరిస్తూ జీవితంలో ఒక లక్ష్యం ఏర్పరుచుకుని దానినే కలగనడం, దానికోసమే జీవించమని అంటారు. దానినే స్ఫూర్తిగా తీసుకున్నాడో ఏమో తెలియదు గాని నటుడు, దర్శకుడు పిల్లిబోయిన వాని అది ఆచరించి చూపి ప్రేమ కడలి అనే చిత్రాన్ని నిర్మించారు. సాధారణంగా ఒక సినిమాను తీయాలంటే ఎంత కష్టమో ఖడ్గం, ఏమాయచేశావే, నేనింతే, అప్పలరాజు, తదితర సినిమాలను చూస్తే తెలుస్తుంది. ఆయా సినిమాలలో హీరోలు డైరెక్టర్లుగా నటించారు. ప్రస్తుతం బద్వేలు నియోజకవర్గాన్ని కేంద్రంగా చేసుకుని ఇక్కడి పరిసరాలను ఆసరాగా చేసుకుని నటన గురించి సాధారణ మనుషులను కలుపుకుని తీసిన సినిమానే 'ప్రేమ కడలి' ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం వహించిన యువకుడు పిల్లిబోయిన నాని స్వగ్రామం, బి.కోడూరు మండలం, పాయలకుంట్ల. ఈ యువకుడు పిల్లిబోయిన నరసింహులు, సుబ్బమ్మల రెండవ సంతానం. సాధారణంగా మనకు ఏ కాస్త తీరిక దొరికినా దొరికినా సినిమాకు వెళ్లాం అనుకుంటాం. మానవునికి ప్రధాన వినోదం సినిమా. అలాంటి సినిమాలు చూడాలంటే ఎవరికి ఇష్టం ఉండదు. అందులో ఓ చిన్న పాత్రలో కనిపించినా మన గురించి గొప్పగా చెప్పుకుంటాం. ఇటువంటి వాటికి దృశ్య రూపం ఇస్తూ నాని షార్ట్ ఫిల్మ్ లు తీస్తూ అనంతరం వెండితెర వరకు వచ్చారంటే సఫలీకృతుడైనట్లే. నాని ఎం ఫార్మశీ చేసి కువైట్లో ప్రభుత్వ ఉద్యోగంలో ఉండేవారు. నటనపై తనకున్న ఆసక్తితో ఈ విషయమై మొదట ఇంట్లో వారికి చెప్పడంతో ఏదో చిన్న చిత్రాలు తీస్తున్నావని వదిలిస్తే ఏకంగా పెద్ద సినిమా అంటే మనలాంటి సామాన్యుల వల్ల కాదని ససేమిరా అన్నారు. అయినా పట్టిన పట్టు విడువకుండా తోటి స్నేహితులు. తనకు తెలిసిన టెక్నిషియన్లతో ఎన్నో వ్యయ ప్రయసాల కోర్చి తన గురించి వివరించి ఎవరైనా సహకారం అందింస్తే బాగుండును అనుకుని అందరికీ చెబుతూ వచ్చారు. సినిమా తీయాలంటే ధైర్యం కన్నా ముందు డబ్బు కావాలని అందుకు ఎంతోమందిని కలిసి తన ప్రయత్నాలు వివరించారు. చివరికి తానే ప్రొడ్యూసర్గా ఉంటూ తనతోటి వారితో కలిసి గత 3 సంవత్సరాల అకుంఠిత దీక్షతో సినిమా నిర్మాణం ప్రారంభించి, నటించి, దర్శకత్వం వహించి సవ్యసాచిలా వ్యవహరించి మొత్తానికి సినిమాను పూర్తి చేశారు. ఒక వైపు ఉద్యోగం మరోవైపు సినిమా అంటే జీవితం కత్తిమీద సాము లాంటిదే అన్ని అడ్డంకులు తట్టుకుని తన భార్య సహకారంతో తన జీవిత లక్ష్యం నెరవేర్చుకుని పలు సినిమా హాళ్లలలో సినిమాను విడుదల చేయడం జరిగింది. సినిమాల గురించి తెలిసిన వారంతా కొత్త వ్యక్తి ఏ మాత్రం దర్శకత్వం చేసి ఉంటాడులే అ నుకున్నారు. అయితే సినిమా చూశాక వారు తమ అభిప్రాయాన్ని మార్చుకుని నానికి అభినందనలు తెలుపుతున్నారు. జనవరి 30న విడుదలై ప్రేమ కడలి చిత్రం మొదట్లో చాలా చోట్ల కేవలం ఒక షో వరకు మాత్రమే అనుమతినిచ్చారు. అయితే థియేటర్లలో సినిమాకు వస్తున్న స్పందనను చూసి ప్రధాన థియేటర్ల రెండు షోలు, మిగతా థియేటర్లలో మూడు, నాలుగు షోలు ప్రదర్శిస్తున్నారు. సాధారణంగా మహిళా ప్రేక్షకులు ఎవరో పెద్ద హీరో, అదికూడా ఫ్యామిలి సెంటిమెంట్ ఉన్న చిత్రాలను చూస్తారనే విషయం మనకు తెలిసిందే. ఈ కుటుంబ భావోద్వేగ చిత్రాన్ని తిలకించేందుకు మహిళలు థియేటర్ల వద్ద బారులు తీరుతున్నారనడంలో అతిశయోక్తి లేదు.

# కనిగిరి పురపాలక సంఘం భవిష్యత్తు బృహత్తర ప్రణాళిక



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఫిబ్రవరి 4)

కనిగిరి పురపాలక సంఘానికి చెందిన భవిష్యత్తు బృహత్తర ప్రణాళిక పురపాలక సంఘం అధికారులు సిద్ధం చేసి పురపాలక సంఘం కార్యాలయం నందు తహశీల్దారు వారి కార్యాలయం, మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారి కార్యాలయం నందు జనవరి 9వ తేదీన ప్రదర్శించినట్లు మునిసిపల్ కమీషనర్ పర్వతనేని శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కనిగిరి పట్టణ పరిధిలోని ప్రస్తుతము ఉన్న రోడ్లను వెడల్పు చేయుటలో భాగంగా బృహత్తర ప్రణాళిక సిద్ధం చేయుట జరిగింది. సదరు కనిగిరి పట్టణ పరిధి లోని కొత్త రోడ్లు 2041 సంవత్సరం వరకు పట్టణ అభివృద్ధిని గుర్తించి తగు చర్యలు నిమిత్తము ప్రతిపాదించినట్లు తెలిపినారు. అభ్యంతరాలు, సలహాలు, సూచనల కొరకు మరో రెండు రోజులు మాత్రమే గడవు కలదని తెలిపారు. ఏదేని అభ్యంతరాలు, సలహాలు, సూచనల ఉన్నయెడల లిఖిత పూర్వకంగా కాని, మెయిల్ ద్వారా కాని పంపగలరని తెలియజేశారు. ప్రచురించబడిన మాస్టర్ ప్లాన్ భవిష్యత్తులో పట్టణ అభివృద్ధి కొరకు తయారు చేశారు. ప్రస్తుతం సదరు రోడ్లకు సంబంధించి భవనముల పై ఎటువంటి చర్యలు తీసుకోడం లేదని, ఎటువంటి పుకార్లు నమ్మవద్దని తెలియజేశారు. ఏదేని సందేహాలు ఉన్న యెడల పురపాలక సంఘం కార్యాలయల సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

# వెలుగు కార్యకర్తల సమావేశం

(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, ఫిబ్రవరి 4)

డిఆర్డిఏ వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి నెల మొదటి, మూడో బుధవారం నిర్వహించే సమీక్ష సమావేశం బుధవారం ఏపీఎం కృపమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని సిసిలు, విఓఏలు హాజరయ్యారు. మొదటి బుధవారం పెద్దారవీడు మండలం మహిళాసమాఖ్య ఆఫీసులో సిసిలకు, విఓఏలకు ఏపిఎం కృపమ్మ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పెద్దారవీడు మండల ఎస్ఐ సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన క్రిమినల్ చట్టాల పై అవగాహన కల్పించారు. మహిళలకు సంబంధించిన చట్టాలు గురించి తెలియజేశారు. ఈ సమావేశంలో సిసిలు సత్తార్, మోహన్రావు, అకౌంటెంట్ భారతి, విఓఏలు హాజరయ్యారు.





On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com.